పాక్కా తెలుగు

ప్రభాత కిరణం
సత్యానికి వారధి

PRJI REGD NO. TGTEL/26/A4986

5 DOTS NETWORK

మేడ్చల్--మల్కాజిగిరి శనివారం 21-11-2026 సంపుటి : 01, సంచిక : 142 పేజీలు : 08 వెల రూ./-4

www.prabhathakiranam.com

Medchal malkajigiri volume:01, issue:142, pages:08 price : Rs./-4 Saturday - 21-11-2026 Circulated to Telangana, published from medchal malkajigiri

అత్యవసరంగా నిర్ణయం తీసుకోండి



- బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ కోసం షేక్ హసీనా దరఖాస్తు
- కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసిన షేక్ హసీనా
- ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు లేఖ రాసిన లండన్ న్యాయవాది స్టీవెన్ పౌల్స్
- మరణశిక్ష పడిన ఖైదీకి పాస్‌పోర్ట్ ఇచ్చేది లేదన్న బంగ్లాదేశ్ అధికారులు

టెక్ వైఫల్యాల ఎఫెక్ట్.. సైబర్ డైరెక్టర్‌ను తొలగించిన ట్రంప్



- వైట్‌హౌస్ జాతీయ సైబర్ డైరెక్టర్ సీన్ కెయిన్‌క్రాస్ తొలగింపు
- వరుస సాంకేతిక వైఫల్యాల కారణంగానే ఈ నిర్ణయం
- గత వారం విమాన, బ్యాంకింగ్, జాతీయ భద్రతా వ్యవస్థల్లో అంతరాయాలు
- కెయిన్‌క్రాస్ తొలగింపును ధ్రువీకరించిన వైట్‌హౌస్ వర్గాలు
- తాత్కాలిక డైరెక్టర్‌గా కిర్‌స్టెన్ డేవిస్ నియామకం

అమెరికాలో ఇటీవల చోటుచేసుకున్న తీవ్రమైన సాంకేతిక అంతరాయాల నేపథ్యంలో వైట్‌హౌస్ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ సైబర్ డైరెక్టర్ సీన్ కెయిన్‌క్రాస్‌ను ఆయన పదవి నుంచి తొలగించింది. దేశంలో వరుసగా సైబర్ భద్రతా వైఫల్యాలు తలెత్తిన కొన్ని రోజులకే ఈ

కేసీఆర్ నా కథలో రావణాసురుడు

- కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లీడర్: సీఎం రేవంత్
- మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్
- కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ
- తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ
- బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం
- తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్,

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది



- రేవంత్ సీఎం అయ్యాకే బీజేపీ 8 ఎంపీలు గెలిచిందన్న కిషన్‌రెడ్డి
- ఇటీవల రెండు ఎమ్మెల్సీల్లోనూ బీజేపీ విజయం సాధించిందని వెల్లడి
- రాబోయే రెండు ఎమ్మెల్సీలపైనా కేంద్ర మంత్రి ధీమా
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శ
- రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ఓట్లు పడవని జోస్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?

సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్



- సిద్దిపేట సభలో సీఎం రేవంత్ వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారన్న హరీశ్
- జనం లేక ఇతర జిల్లాల నుంచి తరలించినట్లు సీపీనే స్వయంగా చెప్పారని వెల్లడి
- కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సభలో సీఎం అసత్యాలు, దూషణలకు దిగారని ఆరోపణ
- దేవాదుల వద్ద మోటార్లు పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని ప్రశ్న
- అబద్ధాల ప్రసంగాలు చేస్తున్నందుకు రేవంత్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్

సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ

యోగి ఆదిత్యనాథ్ తల్లి సావిత్రి దేవి కన్నుమూత



- ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామం పంచూర్‌లో 91 ఏళ్ల వయసులో తుదిశ్వాస
- రేపు హరిద్వార్‌లో అంత్యక్రియలు నిర్వహించే అవకాశం
- పుట్టెడు దుఃఖంలోనూ ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న యోగి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు

81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమించిన కాంగ్రెస్

- 50 శాతం మంది ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు
- 2029 ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రక్షాళన.. సామాజిక న్యాయానికి పెద్దపీట
- ఏఐసీసీ నూతన కార్యదర్శుల జాబితా విడుదల.. 43 మంది కొత్త ముఖాలకు చోటు
- రాహుల్ గాంధీ మార్క్ టీమ్.. యువత, బడుగు బలహీన వర్గాలకే అగ్రతాంబూలం



రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ ప్రక్షాళన చేపట్టింది. వివిధ రాష్ట్రాలు, కీలక విభాగాల పర్యవేక్షణ కోసం మొత్తం 81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల

మెస్సీని తీసుకొచ్చాం త్వరలో రొనాల్డోను రప్పిస్తాం



- లోక్‌సభ సీట్ల పెంపునకు జనాభాతో పాటు జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలన్న రేవంత్ రెడ్డి
- కేవలం జనాభా ప్రాతిపదికన విభజిస్తే దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలుపుతామని వెల్లడి
- త్వరలోనే ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తెస్తామని స్పష్టీకరణ
- మెస్సీ తరహాలోనే త్వరలో క్రిస్టియానో రొనాల్డోను రాష్ట్రానికి ఆహ్వానిస్తామన్న సీఎం

తీరం దాటిన 'అక్వాన్' తుపాను..

ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

తీరం దాటే సమయంలో గంటకు 70



నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ

వర్షపాతం నమోదు

ముందస్తు చర్యల్లో భాగంగా పలు రైళ్లు రద్దు చేసిన ఈస్ట్ కోస్ట్ రైల్వే

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!



- టీడీపీకి 22 జడ్పీ ఛైర్మన్ స్థానాలు
- జనసేనకు 4, బీజేపీకి ఒక స్థానం
- వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా
- ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వివరాలు ఈసీ ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో

నిత్యావసరాల ధరల నియంత్రణకు ఏడాది యాక్షన్ ప్లాన్

నెలకు రూ.100 కోట్లు ఖర్చు

- వచ్చే నెల 1 నుంచి రేషన్ షాపుల్లో సబ్సిడీ సరుకులు
- కిలో కందిపప్పు రూ. 100, గోధుమ పిండి రూ. 25
- లీటర్ పామాయిల్ రూ.125 కే పంపిణీ
- ప్రతివారం మార్కెట్ ధరలపై ఉన్నతస్థాయి సమీక్షలు
- రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



నిత్యావసర సరకుల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ధరల నియంత్రణపై క్యాంపు

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ నా కథలో రావణాసురుడు

మొదటిపేజీ తరువాయి - కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

మెస్సీని తీసుకొచ్చాం.. త్వరలో రొనాల్డోను రప్పిస్తాం

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్‌లో నిర్వహించిన ఏబీపీ నెట్‌వర్క్ 'ది సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026' వేదికగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో జనాభాను మాత్రమే కొలమానంగా తీసుకోకూడదని, ఆయా రాష్ట్రాల ఆర్థిక ప్రగతి (జీడీపీ)కి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. కేవలం జనాభా ఆధారంగా 50 శాతం సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా పడిపోతుందని, కేవలం ఉత్తరాది సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే జనాభా, జీడీపీ రెండింటినీ పరిగణనలోకి తీసుకుని పునర్విభజన చేపట్టాలని సూచించారు. దేశాభివృద్ధిలో నెహ్రూ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ అందించిన ఆర్థిక, సంక్షేమ సంస్కరణలే తమకు ఆదర్శమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి భారీ ప్రాజెక్టులతో ప్రపంచ స్థాయి గుర్తింపు తెస్తున్నామని తెలిపారు. గత మూడేళ్లలోనే 65 శాతం హామీలు అమలు చేశామని, మిగిలిన పనులను వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు పెట్టుబడిదారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ బడుల్లో హాజరు శాతాన్ని పెంచామని సీఎం వివరించారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు చదువు మానేయకుండా ఉండేందుకు ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తెచ్చే యోచన చేస్తున్నామన్నారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటుతో పాటు, ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుస్తున్నామని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి అంతర్జాతీయ వర్సిటీలు కూడా తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. మరోవైపు క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 8 వేల మంది క్రీడాకారులతో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, త్వరలోనే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?

మొదటిపేజీ తరువాయి - జీవిత బీమా సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు. కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

తెలంగాణలో బీజేపీ అసలైన ఆట మొదలైంది

మొదటిపేజీ తరువాయి - జి. కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తెలంగాణ రాజకీయాల్లో ఇకపై భారతీయ జనతా పార్టీ అసలైన ఆట ప్రారంభమవుతుందని సంచలన ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం నిశ్చయమైన రాజకీయ మార్పును బలంగా ఆకాంక్షిస్తున్నారని, ఆ మార్పును నిజం చేసే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలను తిప్పికొడుతూ ఎన్నికల గణాంకాలను కిషన్ రెడ్డి ప్రస్తావించారు. "రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాతే రాష్ట్రంలో బీజేపీ ఏకంగా 8 లోక్‌సభ స్థానాలను దక్కించుకుంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన రెండు శాసనమండలి (ఎమ్మెల్సీ) స్థానాల్లోనూ కాషాయ జెండానే రెపరెపలాడింది. త్వరలో జరగబోయే మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలను సైతం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం" అని ఆయన కుండబద్దలు కొట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం గూడుకట్టుకుందని ఆయన ఆరోపించారు. ఆ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో వాటికి ఓటు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి, ప్రజా ఆకాంక్షల సాకారం నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కమలం వికసించడం తథ్యమని కిషన్ రెడ్డి తేల్చిచెప్పారు.

యోగి ఆదిత్యనాథ్ తల్లి సావిత్రి దేవి కన్నుమూత



మొదటిపేజీ తరువాయి - మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి సావిత్రి దేవి (91) కన్నుమూశారు. ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్ జిల్లాలో ఉన్న తమ స్వగ్రామం పంచూర్‌లోని నివాసంలో ఆమె తుదిశ్వాస విడిచారు. వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సావిత్రి దేవి మరణవార్తను పౌరీ గఢ్వాల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ) సర్వేశ్ పన్వార్ ధ్రువీకరించారు. ఆమె భౌతికకాయానికి రేపు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఈ విషయమై పోలీసు, స్థానిక జిల్లా యంత్రాంగం కుటుంబ సభ్యులతో సమన్వయం చేసుకుంటోందని పేర్కొన్నారు. గతంలో ఆమె అనారోగ్యానికి గురైనప్పుడు రిషికేశ్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సావిత్రి దేవి మృతి పట్ల ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తల్లి ప్రేమ, ఆశీస్సులు జీవితంలో ఎంతో అమూల్యమైనవని, ఆమె మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. దివంగత సావిత్రి దేవి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తిని యోగి ఆదిత్యనాథ్ కుటుంబానికి ప్రసాదించాలని కేదార్‌నాథ్ స్వామిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, కన్నతల్లి మరణవార్త తెలిసినప్పటికీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యక్తిగత బాధను పక్కనపెట్టి కర్తవ్యానికే ప్రాధాన్యతనిచ్చారు. గోరఖ్‌పూర్‌లో ముందుగా నిర్ణయించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు ట్యాబ్లెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన యథావిధిగా పాల్గొన్నారు. ప్రజాసేవకే తొలి ప్రాధాన్యమని చాటిచెబుతూ ఆయన తన బాధ్యతలను కొనసాగించడం గమనార్హం.

నిత్యావసరాల ధరల నియంత్రణకు ఏడాది యాక్షన్ ప్లాన్



మొదటిపేజీ తరువాయి - కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను అరికట్టేందుకు ప్రతివారం సమీక్షలు జరపడంతో పాటు నిరంతర క్షేత్రస్థాయి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ధరల స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ.100 కోట్లను వెచ్చిస్తోందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చౌకధరల దుకాణాల (రేషన్ షాపులు) ద్వారా ప్రత్యేక సబ్సిడీ ధరలతో సరుకులను పంపిణీ చేయనున్నారు. ఈ నిర్ణయం ప్రకారం కిలో కందిపప్పు రూ.100, కిలో గోధుమ పిండి రూ. 25, లీటర్ పామాయిల్ రూ.125 చొప్పున కార్డుదారులకు అందజేయనున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థలోని రేషన్ బియ్యం అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ నిల్వలపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. పప్పుధాన్యాలు, వంటనూనెలతో పాటు మార్కెట్లో కూరగాయల ధరల హెచ్చుతగ్గులపైనా నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. పంటలు పండించే అన్నదాతలకు నష్టం వాటిల్లకుండా, కొనుగోలు చేసే సామాన్యుడిపై భారం పడకుండా సమతుల్య విధానాలతో చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం



మొదటిపేజీ తరువాయి - తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లాల వారీగా ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.

తీరం దాటిన 'అక్వాన్' తుపాను.. ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు



మొదటిపేజీ తరువాయి - తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు. తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది. తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

టెక్ వైఫల్యాల ఎఫెక్ట్.. సైబర్ డైరెక్టర్‌ను తొలగించిన ట్రంప్





మొదటిపేజీ తరువాయి - పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత వారం రోజులుగా అమెరికాను పలు టెక్నికల్ సమస్యలు అతలాకుతలం చేశాయి. దేశవ్యాప్తంగా విమాన సేవలు గంటల తరబడి నిలిచిపోవడం, మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం కారణంగా ఈ-మెయిల్, బ్యాంకింగ్ వ్యవస్థలు స్తంభించడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. చివరకు అత్యంత కీలకమైన జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) నెట్‌వర్క్‌లో కూడా తాత్కాలికంగా సమస్యలు తలెత్తడం తీవ్ర కలకలం రేపింది. ఈ వరుస వైఫల్యాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కెయిన్‌క్రాస్‌ను పదవి నుంచి తొలగించారని వైట్‌హౌస్ ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. "సీన్ కెయిన్‌క్రాస్‌ను తొలగించడానికి అధ్యక్షుడు పూర్తి మద్దతు ఇచ్చారు" అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో సైబర్ భద్రతా విధానాలు, వ్యూహాలను పర్యవేక్షించడం కెయిన్‌క్రాస్ ప్రధాన బాధ్యత. ఆయన స్థానంలో రక్షణ శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ) కిర్‌స్టెన్ డేవిస్ తాత్కాలికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే, తన తొలగింపుపై స్పందించేందుకు కెయిన్‌క్రాస్ నిరాకరించారు. ఒకే వారంలో విమానయానం నుంచి జాతీయ భద్రత వరకు కీలక రంగాల్లో సాంకేతిక వైఫల్యాలు చోటుచేసుకోవడం ట్రంప్ యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి పెంచింది. ఈ నేపథ్యంలో సైబర్ భద్రత విషయంలో ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరించనుందో కెయిన్‌క్రాస్ తొలగింపు స్పష్టమైన సంకేతమిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమించిన కాంగ్రెస్



మొదటిపేజీ తరువాయి - చేసింది. ఈ క్రమంలోనే గతంలో బాధ్యతలు నిర్వర్తించిన 25 మంది నాయకులను పదవుల నుంచి తప్పించి, సరికొత్తగా 43 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా 'సామాజిక న్యాయం' సూత్రానికి పెద్దపీట వేశారు. మొత్తం 81 మంది కార్యదర్శుల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 29 మంది, ఓబీసీ నుంచి 20, ఈబీసీ నుంచి 5, ఎస్సీల నుంచి 11, ఎస్టీల నుంచి 5, మైనార్టీల నుంచి 11 మందికి చోటు దక్కింది. మహిళా ప్రాతినిధ్యం కింద 12 మందికి (సుమారు 15 శాతం) బాధ్యతలు అప్పగించారు. ఈ నేతల సగటు వయస్సు 49 ఏళ్లు కాగా, మెజారిటీ నాయకులు 50 ఏళ్ల లోపు వారే కావడం విశేషం. ఈ ఎంపిక కోసం రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలు దాదాపు 200 మంది నేతలను స్వయంగా ఇంటర్వ్యూ చేసి జాబితాను సిద్ధం చేశారు. మీడియా, కమ్యూనికేషన్స్ విభాగ కార్యదర్శులుగా డాక్టర్ వినీత్ పునియా, రుచిరా చతుర్వేదిలను కొనసాగించగా, కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయ కార్యదర్శులుగా ప్రణవ్ ఝా, గౌరవ్ పాండీలు తమ బాధ్యతల్లో కొనసాగనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఈ నూతన కార్యదర్శుల బృందానికి కాంగ్రెస్ నాయకత్వం అప్పగించింది.

అత్యవసరంగా నిర్ణయం తీసుకోండి

మొదటిపేజీ తరువాయి - బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు (ఎన్ఐసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఆమె తరఫు న్యాయవాది అధికారికంగా లేఖ రాశారు. మీడియా కథనాల ప్రకారం... లండన్‌కు చెందిన ప్రముఖ బారిస్టర్ స్టీవెన్ పౌల్స్ ద్వారా హసీనా ఈ దరఖాస్తును సమర్పించారు. నవంబర్ 9న పంపిన తొలి విజ్ఞప్తికి స్పందన రాకపోవడంతో, నవంబర్ 19న ఆయన మరోసారి హైకమిషన్‌కు ఫాలో-అప్ లేఖ పంపారు. హసీనా స్వయంగా సంతకం చేసిన అధికార పత్రాన్ని (ఆథరైజేషన్ లెటర్) కూడా జతచేస్తూ, అత్యవసరంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2024లో చెలరేగిన ప్రజా ఉద్యమం వల్ల భారత్‌కు వచ్చిన షేక్ హసీనా... డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వెళ్లాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రద్దయిన పత్రాల స్థానంలో కొత్త పాస్‌పోర్ట్, ఐడీ కార్డు కోసం ఆమె ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, హసీనా విజ్ఞప్తిని బంగ్లాదేశ్ ప్రభుత్వం తోసిపుచ్చింది. మానవతా వ్యతిరేక నేరాల కేసులో న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించిందని, పైకోర్టులో అప్పీల్ చేసుకునే గడువు కూడా ఇప్పటికే ముగిసిందని అధికారులు తెలిపారు. ఆమె ఒక దోషి అని, ఎలాంటి పరిస్థితుల్లోనూ కొత్త పాస్‌పోర్ట్ జారీ చేయబోమని బంగ్లాదేశ్ చీఫ్ ప్రాసిక్యూటర్ అమీనుల్ ఇస్లాం, న్యాయశాఖ మంత్రి స్పష్టం చేశారు. భారత్‌తో ఉన్న ద్వైపాక్షిక నేరస్థుల అప్పగింత ఒప్పందం ద్వారానే ఆమెను రప్పించి, చట్టపరంగా శిక్షను అమలు చేస్తామని బంగ్లాదేశ్ వర్గాలు పేర్కొన్నాయి.

తేటగుంట గ్రామంలో జనసేన పార్టీలోకి చేరిన 160 కుటుంబాలు





నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): తుని మండలం, తేటగుంట గ్రామంలో జనసేన పార్టీ నాయకులు మర్రి వీరబాబు, గెట్టా శ్రీరామ్, కొల్లు శివాజి, గెట్టా శివ, కలగా తాను ఆధ్వర్యంలో చామంతి సత్తిబాబు మరియు చామంతి వారి కుటుంబాలు, సిగిరెడ్డి సత్తిబాబు,చోడ్రాజు వెంకటపతి రాజు, చోడ్రాజు సూర్యనారాయణ రాజు, చామంతి గోవింద్, గుటూరి శివాజీ, గుటూరి నాగేశ్వరరావు, తూము శ్రీను, పిట్ల లోవరాజు, పిట్ల లోవ నాయకత్వంలో 150 కుటుంబాలు, సూలు 10కుటుంబాలు జనసేన పార్టీ నాయకులు యనమల కృష్ణుడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త చోడిశెట్టి గణేష్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కృష్ణుడు జనసేన పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు తేటగుంట పంచాయతీ కూటమి సర్పంచ్ అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి చామంతి చక్రవేణి సత్తిబాబు గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు , గొల్లపల్లి రాంబాబు , గాది వరహాలు బాబు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంపునకు వర్క్‌షాప్





నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): విద్యార్థుల యందు సైన్స్ పట్ల అభిరుచి ఆసక్తి పెరగడం కొరకు రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోదరన్ విద్యాసంస్థల్లో కాంతి సంబందించిన కెల్లిడియోస్కోపు, పెరిస్కోప్, పిన్ హోల్ కెమెరా ,మ్యూజిక్ బాక్స్ వంటి అంశాలపై విద్యార్థులకు వర్క్ షాప్ జరిగింది. విద్యార్థుల యందు శాస్త్రీయ అవగాహన పెరుగట కొరకు వివిధ రకాల సైన్స్ అంశాలపై వర్క్ షాప్ లు అవసరమని.సైన్స్ అంటే అనుభవ పూర్వక జ్ఞానం పాఠ్యాంశాలలో ని అనే విషయాలను సులువుగా అర్థం చేసుకుంట కొరకు సైన్స్ వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్లు రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె. శ్రీకృష్ణ సాయి పేర్కొన్నారు. విద్యార్థులు సైన్సును ఉత్సాహంగా ,ఉల్లాసంగా నేర్చుకొంటూ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని మోదరన్ విద్యాసంస్థల అధినేత జివి రావు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆర్. ఉమా దేవి, ప్రధానోపాధ్యాయులు ఎం చిట్టిబాబు సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మినర్వా విద్య సంస్థలో మెగా రక్తదానం శిబిరం





కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): స్థానిక ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థల్లో ఎన్ఎస్ఎస్ ,ఎన్‌సిసి విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విద్యా సంస్థల చైర్మన్ ముత్యాల మురళీకృష్ణ గారు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులందరితోని రక్తదానం చేయడం వల్ల కలిగేటువంటి ఉపయోగాలు గురించి క్లుప్తంగా వివరించారు. రక్తదానానికి మించిన దానం మరొకటి లేదు అని అభివర్ణించారు. ఈ రక్తదాన శిబిరాన్ని పెద్దాపురంకి చెందిన రోటరి బ్లడ్ సెంటర్ వారు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని మినర్వా విద్యాసంస్థల కరస్పాండెంట్ ముత్యాల మురళీకృష్ణ గారు రక్తదానం చేయడంతో ప్రారంభించారు. తర్వాత కళాశాలకు చెందిన సుమారు 50 మంది ఎన్‌సిసి మరియు ఎన్ఎస్ఎస్, ఫార్మా మెడికల్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సేకరణ అనంతరం రక్తదాతలందరికీ రోటరి బ్లడ్ సెంటర్ వారు ప్రశంసా పత్రాలను కరస్పాండెంట్ ముత్యాల మురళీకృష్ణ గారు చేతుల మీదుగా అందజేశారు. మరియు ఈ కార్యక్రమానికి రక్తం దానం చేసిన దాతలు అందరికీ తమ సంస్థ తరపున లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పిస్తామని రోటరి బ్లడ్ బ్యాంక్ తరపున డాక్టర్ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ అధికారి , డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిబాబు గారు మరియు జూనియర్ విభాగ్ ఎన్‌సిసి అధికారి చీ.రవికుమార్ పాల్గొన్నారు.

36 ఏళ్లుగా గ్రామీణ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న వీఆర్వో సంస్థ 100 మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ

సర్టిఫికెట్ల ప్రదానం

కాకినాడ జిల్లా జగ్గంపేట నవంబర్ 20: (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండల కేంద్రంలో పనిచేస్తున్నటువంటి గ్రామ పునర్నిర్మాణ సంస్థ (విఆర్ఓ) స్వచ్ఛంద సేవా సంస్థ గత 36 సంవత్సరముల నుంచి అనేక సంక్షేమ పథకాలు గ్రామీణ పేద పిల్లలు, యువత మరియు మహిళలకు సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ఉన్నది, ప్రస్తుతము ఐదు గ్రామాలలో అనగా ఆర్బి పట్నం, వేట్లపాలెం బి పాలెం రామచంద్రాపురం మరియు కృష్ణాపురం గ్రామంలో మొత్తం 100 మంది టైలరింగ్ అభ్యర్థులు నాలుగు నెలలు టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు అందుకోవటం జరిగినది గ్రామ పెద్దల సహకారంతో అందరూ కూడా



మంచి నైపుణ్యతను పొందియున్నారు మరియు వీఆర్వో సంస్థ డైరెక్టర్ గారు పాల్గొని సంస్థ ఆశయాలు కార్యక్రమాల గురించి అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కృష్ణాపురం గ్రామ



పెద్దలు వెలిశెట్టి శ్రీను గారు వీఆర్వో సమస్త అసోసియేట్ డైరెక్టర్ ఫాదర్ మరియ నాయకం గారు, ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్ గారు మరియు టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు వాలంటీర్లు పాల్గొనడం జరిగినది.

కష్టాల నుంచి న్యాయస్థానం వరకు తలారి బాలయ్య విజయ ప్రస్థానం

తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది తలారి బాలయ్యకు అరుదైన గౌరవం..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి; **నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి):** నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా నియామకం -- పేద కుటుంబం నుంచి న్యాయరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రయాణం కామారెడ్డి జిల్లా: బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది తలారి బాలయ్యకు (తండ్రి వెంకయ్య) కు అరుదైన గౌరవం లభించింది. ఆయన సుదీర్ఘ న్యాయవాద అనుభవం, న్యాయరంగంలో అందించిన సేవలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నిర్వహించిన బాధ్యతలను గుర్తిస్తూ గౌరవ తెలంగాణ హైకోర్టు మరియు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా నియమించాయి. ఈ నియామకంతో తుజాల్‌పూర్ గ్రామంతో పాటు కామారెడ్డి జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పేదరికాన్ని అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించిన బాలయ్య తలారి బాలయ్య కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన దివంగత తలారి పోచమ్మ, వెంకయ్య దంపతులకు ఐదవ మరియు చివరి సంతానంగా జన్మించారు. ఆయనకు కేవలం ఎనిమిదేళ్ల వయసులోనే తండ్రి అనారోగ్యంతో మరణించడంతో కుటుంబం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. అయినప్పటికీ బాలయ్య చదువుపై ఉన్న ఆసక్తి, పట్టుదల, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే సంకల్పంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వేసవి సెలవులు, పండుగ సెలవుల సమయంలో స్వగ్రామానికి వచ్చి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తన చదువుకు అవసరమైన సహకారం అందించుకున్నారు. కష్టపడి పనిచేస్తూనే విద్యను కొనసాగించడం ఆయన జీవితంలో ప్రత్యేకమైన అంశం. తొమ్మిదో తరగతి వరకు సిద్దిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసించారు. అనంతరం 1987--88లో బీబీపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. 1989--91లో దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, 1991--95లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ. పూర్తి చేశారు. తన విద్యాభ్యాసాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ప్రవేశం పొంది 1995--98లో ఎల్.ఎల్.బి. పూర్తి చేశారు. అనంతరం 1999--2001లో లేబర్ లా స్పెషలైజేషన్‌తో ఎల్.ఎల్.ఎం. పట్టా పొందారు. గ్రామీణ నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులు తన లక్ష్యానికి అడ్డంకులు కాకుండా ఉన్నత విద్యను పూర్తి చేయడం ఆయన పట్టుదలకు నిదర్శనం.

1999 నుంచి న్యాయవాదిగా సుదీర్ఘ ప్రస్థానం

తలారి బాలయ్య 1999 ఏప్రిల్ 7న అప్పటి బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ వివిధ రకాల సివిల్, క్రిమినల్ మరియు ఇతర న్యాయపరమైన కేసుల్లో వాదనలు వినిపించారు. న్యాయశాస్త్రంపై పట్టు, కేసుల అధ్యయనంలో నిబద్ధత, న్యాయపరమైన అంశాలను లోతుగా విశ్లేషించే సామర్థ్యం,



బాధితులకు న్యాయం అందించాలనే తపనతో న్యాయవాద రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అనేక కేసుల్లో బాధితుల తరఫున వాదిస్తూ వారి హక్కులు, న్యాయపరమైన ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేశారు. క్రమంగా అనుభవజ్ఞుడైన సీనియర్ న్యాయవాదిగా పేరు సంపాదించుకున్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విశిష్ట సేవలు

ఆయన న్యాయరంగంలో అందించిన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 3న రంగారెడ్డి జిల్లా కోర్టు పరిధిలోని ఎల్.బి. నగర్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. 2018 నుంచి 2022 వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన కాలంలో ప్రభుత్వ తరఫున అనేక క్రిమినల్ కేసులను సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా నేర బాధితులకు న్యాయం అందించడం, సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్థంగా ప్రవేశపెట్టడం, సాక్షుల వాంగ్మూలాలు మరియు కేసులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను సమన్వయం చేయడం వంటి బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితుల తరఫున న్యాయం జరిగేలా కృషి చేశారు. ఆయన నిర్వహించిన పలు కేసుల్లో నేరస్థులకు జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు విధించబడటం ఆయన ప్రాసిక్యూషన్ సేవల్లో ముఖ్యమైన అంశంగా నిలిచింది. ప్రాసిక్యూటర్‌గా ఆయన చూపిన వృత్తిపరమైన నిబద్ధత, బాధ్యతాయుతమైన పనితీరు, పోలీసు మరియు న్యాయశాఖలతో సమన్వయం ప్రశంసలు అందుకున్నాయి.

పోలీసు శాఖ నుంచి అవార్డులు, ప్రశంసా పత్రాలు

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అప్పటి రాచకొండ పోలీస్ కమిషనర్, ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న మహేష్ భగవత్ గారు, అలాగే అప్పటి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ గార్ల చేతుల మీదుగా పలు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. నేర విచారణ, న్యాయస్థానాల్లో కేసుల నిర్వహణ, బాధితులకు న్యాయం అందించే ప్రక్రియలో తన వృత్తిపరమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం ద్వారా పోలీసు మరియు న్యాయశాఖ వర్గాల్లో గుర్తింపు పొందారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా నూతన బాధ్యతలు

దాదాపు 28 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో అనుభవం సంపాదించి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా సేవలందించిన తలారి బాలయ్యను గౌరవ తెలంగాణ హైకోర్టు మరియు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా నియమించడం ఆయన వృత్తిపరమైన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. న్యాయవ్యవస్థలో న్యాయం, నిష్పాక్షికత, చట్టబద్ధత, రాజ్యాంగ విలువలు అత్యంత ప్రాధాన్యమైనవి. ఈ కొత్త బాధ్యతల్లో కూడా చట్టానికి అనుగుణంగా, నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం కలిగించేలా సేవలందిస్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకమైన జీవితం

వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, కష్టపడి చదువుకొని న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి, న్యాయవాదిగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ఇప్పుడు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా ఎదగడం తలారి బాలయ్య జీవితంలోని విశేషమైన ప్రయాణం. ఆయన ప్రస్థానం గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా కృషి, పట్టుదల, క్రమశిక్షణ, విద్య పట్ల అంకితభావం ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన జీవితం నిరూపిస్తోంది.

కృతజ్ఞతలు తెలిపిన తలారి బాలయ్య

తనను స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా నియమించినందుకు గౌరవ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి, తెలంగాణ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి తలారి బాలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో ఈ స్థాయికి చేరుకోవడానికి సహకరించిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, న్యాయవాద సహచరులు, న్యాయశాఖ మరియు పోలీసు శాఖ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా న్యాయవ్యవస్థ పట్ల గౌరవంతో, చట్టబద్ధత మరియు నిష్పాక్షికతకు ప్రాధాన్యమిస్తూ తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. తుజాల్‌పూర్ గ్రామం నుంచి నాంపల్లి కోర్టు వరకు సాగిన తలారి బాలయ్య ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు; పట్టుదలతో చదివి, కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనుకునే గ్రామీణ యువతకు స్ఫూర్తినిచ్చే విజయగాథ.

జగ్గంపేటలో కూటమి ఘన విజయం ఏకగ్రీవంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక

అధ్యక్షురాలిగా రేఖా ధనలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా అడబాల వెంకటేశ్వరరావు

హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కాకినాడ జిల్లా, జగ్గంపేట: నవంబర్ 19 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): జగ్గంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి





సమక్షంలో జగ్గంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా రాజపూడి గ్రామానికి చెందిన రేఖా ధనలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా రామవరం గ్రామానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యుడు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ హాజరై నూతన ఎంపీపీ రేఖా ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ అడబాల వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తూ మండల ప్రజా పరిషత్ ను అభివృద్ధి పథంలో నడిపించాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలను కోరారు.

రెవెన్యూ అధికారుల అండదండలతోనే మట్టి మాఫియా చెలరేగుతోందా?

ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు.. అసైన్డ్ భూములే లక్ష్యంగా తవ్వకాలు?

అన్ని తానై నడిపిస్తున్న తాహసిల్దార్ కార్యాలయానికి చెందిన రెవెన్యూ ఇన్స్పెక్టర్

తాసిల్దార్ కు తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం

అధిక లోడుతో బిటీ రోడ్లు ధ్వంసం.. పొరుగు రాష్ట్రాల నుంచి టిప్పర్ల ద్వారా స్థానిక మట్టి తరలింపు

చిరునోములలో ఆగని అక్రమ మట్టి రవాణా!

బోనకల్, **నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి):** బోనకల్ మండల పరిధిలోగల చిరునోముల గ్రామంలో అక్రమ మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అక్రమ రవాణా వెనుక రెవెన్యూ అధికారుల అండదండలు ఉన్నాయా? లేక క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఆ క్లస్టర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండగా, తహసీల్దార్‌కు తెలియకుండానే గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం సాగుతోందా? అనే ప్రశ్నలు



అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తలెత్తుతున్నాయి.ముఖ్యంగా పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములే అక్రమ మట్టి తవ్వకాలకు లక్ష్యంగా మారుతున్నాయా? అనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది. పేదల భూముల నుంచి మట్టిని తరలిస్తూ వారి హక్కులకు భంగం కలిగిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.మరోవైపు అధిక లోడుతో భారీ టిప్పర్లను నడపడం వల్ల నూతన బీటీ రోడ్లు బీటలు వారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి సైతం టిప్పర్ల ద్వారా మట్టి రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? మట్టి ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే



చిరునోములలో జరుగుతున్న మట్టి తవ్వకాలు, రవాణాపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

సింగరేణి ఉద్యోగుల 24 డిమాండ్ల పరిష్కారానికి కృషి

జనవరిలో నిరవధిక సమ్మెకు సిద్ధం

ఆర్జీ-3 ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశంలో

నాయకుల హెచ్చరిక



రామగిరి నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని, సమ్మె నోటీసులో పొందుపరిచిన 24 డిమాండ్లపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరిగితే జనవరిలో నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఆర్జీ-3 ఏరియాలో ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం బ్రాంచ్ సెక్రటరీ మందల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బి. క్రాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కె. రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగరేణిలో కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలు, యాజమాన్యంతో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని నాయకులు ఉద్యోగులకు వివరించారు. పెర్క్‌పై ఐటీపీఓల్ ఇండియా ఉద్యోగులకు అందుతున్న తరహాలో సింగరేణి ఉద్యోగులకు కూడా రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలు కల్పించే అంశంపై చర్చించారు. సొంతింటి పథకం మొదటి విడతలో ఉద్యోగులకు ఇళ్లను అందించేలా యాజమాన్యాన్ని ఒప్పించినట్లు పేర్కొన్నారు. మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్ పాలసీని అమలు చేసి, బ్యాక్‌డేట్ నుంచి ఓవర్‌మన్ ప్రమోషన్లు కల్పించే అంశంపై కూడా యాజమాన్యం అంగీకరించినట్లు వెల్లడించారు. మారుపేర్ల సమస్య పరిష్కారంపై చర్చలు జరిపినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో, గ్లూకో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించారు. సీబీఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలు, పాఠశాలల పునరుద్ధరణకు సంబంధించి ఎన్టీపీసీ, నవభారతి పాఠశాలల్లో ఉన్న విధానాలను అనుసరించేలా చర్యలు తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందని వివరించారు. సమ్మె నోటీసులో పొందుపరిచిన 24 డిమాండ్లపై యాజమాన్యం సర్క్యులర్ రూపంలో స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని కోరారు. కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని, లేనిపక్షంలో జనవరిలో నిరవధిక సమ్మె చేపట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవి. రావు, బ్రాంచ్ అసిస్టెంట్ డిటి. రావు, సీపీఐ నాయకుడు జి. గోవర్ధన్, ఆర్జీ-3 ఏఐటీయూసీ నాయకులు ఈ. గంగాధర్, కె. మల్లేష్, ఎం. సురేష్, జి. శ్రీనివాస్, ఏ. పోశం, ఎన్. రమేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు కె. రాజు, చందూలాల్, మైన్ కమిటీ, ఐటీ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు, ఆర్జీ-3 ఉద్యోగులు పాల్గొన్నారు.

కోట్ల రూపాయలతో వచ్చే దొరలను తట్టుకుని బరిలో నిలబడ్డా

ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నల్లమాస శ్రీకాంత్ గౌడ్

సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబం నుంచి వచ్చా

ప్రత్యేక తెలంగాణ కోసం 11 రోజులు నిరాహార దీక్ష చేసి జైలుకు వెళ్ళా

ప్రత్యర్థులపై తీవ్ర విమర్శలు గుప్పించిన తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) ఎమ్మెల్సీ అభ్యర్థి

కాంగ్రెస్ కు ఓట్ల అడిగే అర్హత లేదు

పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యను వ్యాపారంగా మార్చాడు

బిజెపికి ఎన్నికల రాగానే కులాలు మతాలు దేవుళ్ళు గుళ్ళు యుద్ధాలు గుర్తొస్తాయి

గెలిపిస్తే ఉచిత విద్య, యూత్ కమిషన్, లక్ష సూపర్ న్యూమరరీ పోస్టుల కల్పన

సామాజిక న్యాయంతో అభ్యర్థులను నిలిపిన కల్వకుంట్ల కవిత



యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అభ్యర్థి డాక్టర్ నల్లమాస శ్రీకాంత్ గౌడ్ ప్రధాన పార్టీల అభ్యర్థులపై, ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా శుక్రవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బరిలో ఉన్న ఇతర అభ్యర్థులంతా కోట్ల రూపాయల డబ్బు సంచులతో ఎన్నికలకు వస్తుంటే, తాను మాత్రం ఉద్యమ నేపథ్యం, సామాన్యుడి బలంతో పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు.

కల్లుగీత కార్మిక కుటుంబం నుంచి వచ్చా జైలు జీవితం గడిపా..

తన నేపథ్యాన్ని వివరిస్తూ, తన దగ్గర కోట్ల రూపాయలు లేవని, తాను ఒక సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబం నుంచి వచ్చిన వాడినని డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. 2009 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నానని, ప్రత్యేక రాష్ట్రం కోసం 11 రోజుల పాటు నిరాహార దీక్ష చేయడంతో పాటు జైలు జీవితం కూడా గడిపానని గుర్తు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు పూర్తి చేసిన తాను, విద్యార్థులు, నిరుద్యోగుల కష్టాలను స్వయంగా చూశానన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పల్లా, ప్రత్యర్థి నరోత్తమ్ రెడ్డిపై ఫూటు విమర్శలు..

2015లో గెలిచిన ఆనాటి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి పదవిని అడ్డుపెట్టుకుని వ్యాపారం చేశారని, విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశారని శ్రీకాంత్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని 14 యూనివర్సిటీలను నాశనం చేశారని, పేపర్ లీకేజీలకు పాల్పడి విద్యార్థుల ఆత్మహత్యలకు కారకుడయ్యాడని విమర్శించారు. అలాగే, తనకు ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న నరోత్తమ్ రెడ్డి తన తండ్రి పేరు చెప్పుకుని కోట్ల రూపాయల డబ్బుతో ఎన్నికల బరిలోకి దిగారని మండిపడ్డారు. ఒకప్పుడు ఆయన తండ్రి, తాతల ముందు సామాన్య జనం చెప్పులు విడిచి, టవలు నడుముకు చుట్టుకుని తలవంచి నడవాల్సిన పరిస్థితి ఉండేదని, అలాంటి దొరల కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు ఈరోజు ఎన్నికల్లో పోటీ చేస్తుంటే, వాళ్లందరినీ తట్టుకుని ఒక సామాన్యుడిగా నేను నిలబడ్డాను అని శ్రీకాంత్ గౌడ్ ఉద్వేగంగా అన్నారు.

ఆత్మహత్యలకు కారణమెవరు? కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు..

గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని ఎవరిని అడిగి 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచిందని ఆయన నిలదీశారు. ఈ నిర్ణయం వల్ల కొత్త ఉద్యోగాలు రాక వేలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల పాటు ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకపోవడం వల్లే సునీల్, ప్రవీణిక వంటి నిరుద్యోగులు, 23 మంది ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిజెపి పచ్చి దగా కోరు పార్టీ..

బిజెపి పచ్చి దగాకోరు పార్టీ అని విమర్శించారు. బిజెపి బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుందని, అందుకే బీఆర్ఎస్ మీద ఉన్న కేసులు బయటికి పొక్కటం లేదన్నారు. బిజెపి సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిందని, ఆ విధంగా చూస్తే ఇప్పటికి 26 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాలని, ఆ ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి దేశంలో ఒక కొత్త ప్రాజెక్టు గానీ కొత్త పరిశ్రమ గాని నెలకొల్పకపోగా, ప్రభుత్వ సంస్థలతోపాటు, దేశాన్ని అమ్మకానికి బిజెపి పెట్టిందని ఆయన విమర్శించారు. బిజెపికి ఎన్నికలు రాగానే కులం, మతం, గుళ్ళు, ముస్లింలు, యుద్ధాలు గుర్తుకు వస్తాయని డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఇక అధికార కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీకి పట్టభద్రులను ఓట్లు అడిగే నైతిక అర్హత లేదన్నారు. అధికారంలోకి వచ్చాక ఇంతవరకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయలేదని, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తలేదని, పైగా 2,890 పాఠశాలలను మూసివేశారని (బంద్ చేశారని) ఆరోపించారు. ఇన్ని వైఫల్యాలు పెట్టుకుని కాంగ్రెస్ నేతలు ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. తనను గెలిపిస్తే ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు పూర్తిగా ప్రభుత్వ బాధ్యతతో ఉచిత విద్య అందేలా పోరాడుతానన్నారు. యూత్ కమిషన ఏర్పాటు చేసి లక్షల ఉద్యోగ నియామకాలు, ప్రతి గ్రామంలో యువతకు ఉపాధి కోసం యూత్ ఎంపవర్‌మెంట్ సొసైటీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

శాశ్వత ఉద్యోగాలు ఉద్యమకారులకు న్యాయం..

పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్ వ్యవస్థలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, తెలంగాణ ఉద్యమకారులకు లక్ష సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించాలని డిమాండ్ చేశారు. పదివేల మంది చదివే వర్సిటీల్లో వెయ్యి మందికి కూడా హాస్టళ్లు లేవని, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు టోకెన్ వ్యవస్థతో కూడిన మిడ్ డే మీల్స్ క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ల విడుదల, మెస్ ఛార్జీల పెంపు, పార్ట్‌టైమ్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ జరగాలన్నారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నూతన పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బోనగిరి పట్టణములు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చందుపట్ల సుజిత్ రావు, ఉమ్మడి నల్లగొండ, వరంగల్,ఖమ్మం జిల్లా ఇన్చార్జి సీనియర్ జర్నలిస్టు సయ్యద్ ఇస్మాయిల్, రక్షణ సేన నాయకులు తంగళ్ళపల్లి శ్రీకాంత్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జ్ అనిత, జిల్లా నాయకులు ఆకుల నరేష్, తుంగతుర్తి సంతోష్, మంచాల సంతోష్, చిన్నం ప్రభాకర్, పండు, భాను, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి కోసం పది మెట్లు దిగడానికైనా సిద్ధం

శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకే పనులు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి కోసం అవసరమైతే పది మెట్లు దిగడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి మాత్రమే తమ ఏకైక లక్ష్యమని, ఇందులో ఎవరి సొంత నిర్ణయాలకు తావులేదని పేర్కొన్నారు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీ భారతీ తీర్థ స్వామి, శ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి సూచనలు, ఆదేశాల మేరకే ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత, విశిష్టత, ప్రాశస్త్యానికి ఎలాంటి భంగం కలగకుండా పనులు కొనసాగిస్తున్నామని వివరించారు. విమర్శలకు ప్రతివిమర్శలతో సమాధానం చెప్పడం తమ ఉద్దేశం కాదని, భక్తులకు వాస్తవాలను వివరించడమే తమ బాధ్యత అని అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధిపై కొందరు కావాలని చేస్తున్న అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దని ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు

నగరడోనలో విషాదం.. మహిళ ఆత్మహత్య

కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకొని బలవన్మరణం

ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ



చిప్పగిరి నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): మండల పరిధిలోని నగరడోన గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాండ్ల జ్యోతి (39), భర్త గంగాధర్ గురువారం రాత్రి కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.రాత్రి సమయంలో నిద్ర మేల్కొన్న కుటుంబ సభ్యులు జ్యోతి ఉరివేసుకున్న విషయాన్ని గుర్తించి వెంటనే ఆమెను కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునే సమయానికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు.ఈ ఘటనతో నగరడోన గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జ్యోతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బోర్‌వెల్స్ లారీ బోల్తా.. ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు..!

బంటనహాల్--ఏరూరు గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం





చిప్పగిరి నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): బోరు వేయడానికి వెళ్తున్న బోర్‌వెల్స్ లారీ మార్గమధ్యంలో అదుపుతప్పి బోల్తా పడటంతో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషాద సంఘటన చిప్పగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. బంటనహాల్, ఏరూరు గ్రామాల మధ్య ఉన్న అడ్డరోడ్డులో ఈ ప్రమాదం జరిగింది.బోరు వేయడానికి వెళ్తున్న లారీ మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు తీవ్ర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.చిప్పగిరి ఎస్ఐ సి.వి. నరసింహులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంతో బంటనహాల్, ఏరూరు గ్రామాల పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్వేరో ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయండి

వర్ధన్నపేట నియోజకవర్గ స్వేరో కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్



హనుమకొండ నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): శుక్రవారం రోజు హసన్పర్తి మండల కేంద్రంలో స్వేరోస్ ఆత్మీయ సమ్మేళన సన్నాహక కార్యక్రమాన్ని వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 22న కాళోజీ కళాక్షేత్రం హనుమకొండలో నిర్వహించబోయే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమ సభను విజయవంతం చేయుటకు స్వేరో నాయకులు,భారత రాష్ట్ర సమితి నాయకులు 66వ డివిజన్ అధ్యక్షులు బండి రజిని కుమార్,ఓ మాజీ అధ్యక్షులు పాపిశెట్టి శ్రీధర్, హనుమకొండ జిల్లా ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి

చంద్రమోహన్ స్వేరో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమ సభ గోడపత్రిక ఆవిష్కరించారు.

తదనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ స్వేరో ఇంటర్నేషనల్ ఫౌండర్ డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ తెలంగాణ గురుకుల సెక్రటరీగా ఉన్న సమయంలో ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా వివిధ రంగాలలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. నవంబర్22 ఆదివారం రోజు కాళోజీ కళాక్షేత్రం హనుమకొండలో జరుగు స్వేరో ఆత్మీయ సమ్మేళన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్(ఐపీఎస్) అడిషనల్ డీజీపీ (వి ఆర్ ఎస్) పాల్గొనే ఈ సభను అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరో ఇంటర్నేషనల్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు మాదారపు నవీన్ కుమార్, ఆత్మీయ సమ్మేళన ప్రోగ్రాం వర్ధన్నపేట నియోజకవర్గ కో కన్వీనర్ బోస్ రాజేశ్వరి స్టీరింగ్ కమిటీ సభ్యులు పూరిబండి ఓంకార్ యాదవ్, మేకల అభినేష్,స్వేరో మండల అధ్యక్షులు మేకల సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పల్లాల యాదగిరి,మేకల రాజేందర్,నద్దునూరి నాగరాజ్ ఓయు నాయకులు పెద్దమ్మ రమేష్,ఆరెపెల్లి శ్రవణ్, అంబాల రమేష్,స్వేరో డివిజన్ అధ్యక్షులు పంగ అఖిల్ కుమార్, మేకల బబ్లు తదితరులు పాల్గొన్నారు.

58 ఏళ్ల వయసులోనూ విజేతగా బుగ్గాజీ

-3 కిలోమీటర్ల సైకిల్ రేసులో ప్రథమ స్థానం

-కంపెనీ స్థాయి పోటీలకు అర్హత



రామగిరి నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): రామగిరి మండలం సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి స్టేడియంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్జీ 3, భూపాలపల్లి రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన 3 కిలోమీటర్ల సైకిల్ రేసులో ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ1 సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన జనరల్ అసిస్టెంట్ కాంటెవాడ బుగ్గాజీ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ పోటీలో భూపాలపల్లి కేటీకే ఓసీపి-3 అండర్ మేనేజర్ ఆడెపు రమేష్ తో ఆయన హోరాహోరీగా తలపడి, ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో విజయం సాధించి కంపెనీ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. 58 సంవత్సరాల వయసులోనూ ఏమాత్రం తగ్గని ఉత్సాహంతో, పట్టుదలతో, నిరంతర సాధనతో బుగ్గాజీ సాధించిన ఈ విజయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రతి ఏటా ఏరియా, రీజినల్ స్థాయి క్రీడా పోటీల్లో విజయాలు సాధిస్తూ వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తున్నారు. ఈ సందర్భంగా బుగ్గాజీని పలువురు అధికారులు, ఉద్యోగులు, క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే కంపెనీ స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో విజయం సాధించి ఆర్జీ-3 ఏరియాకు మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



రామగిరి నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి):ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రామగుండం 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా పర్సనల్ విభాగాధిపతి ఎండి.ఆసిఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ 3, ఏపీఏ, భూపాలపల్లి ఏరియాల క్రీడాకారులకు నిర్వహించిన, రీజినల్ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రో బాల్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా గెలుపు కోసం మరింత పట్టుదలతో కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడలు ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, టీమ్ స్పిరిట్‌ను పెంపొందిస్తాయని తెలిపారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచడం అభినందనీయమని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పరిపూర్ణ చారి, కె.నరసింహ చారి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్స శ్రీనివాస్, క్రీడల సమన్వయ కర్త బుర్ల సదానందం ఇతర క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో ట్రాఫిక్ పద్మవ్యూహం

'సిగ్నల్' పడితేనే మోక్షం

తిప్పాపూర్ వంతెన, ఆలయ పరిసరాల్లో నిత్యం వాహనాల నరకం



వేములవాడ టౌన్ నవంబర్ 20 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాల్సిన పట్టణ రహదారులు నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ముఖ్యంగా సోమ, శుక్ర, ఆదివారాలతో పాటు పర్వదినాల్లో భక్తుల వాహనాలు పోటెత్తడంతో పట్టణంలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటోంది. పట్టణానికి ప్రధాన ముఖద్వారమైన తిప్పాపూర్ వంతెన వద్ద, అలాగే రాజన్న ఆలయ పరిసరాల్లో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. రహదారులు ఇరుకుగా ఉండటం, ఎటునుంచి ఏ వాహనం వస్తుందో తెలియక వాహనదారులు, పాదచారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం సిబ్బందికి సైతం తలకు మించిన భారంగా మారింది. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, తిప్పాపూర్ బ్రిడ్జి, ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వాహనదారులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించబడి, ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని వారు భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ స్పందించి వేములవాడలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని భక్తులు, పట్టణవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయాలు సొంతం : శృతి జోయ్‌జోడే



నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): మహిళలు తమ కలలను సాకారం చేసుకోవడానికి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించవచ్చని 'దివాలిషియస్ మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్--2026' విజేత శృతి జోయ్‌జోడే అన్నారు. ప్రతిభను నిరూపించుకోవడానికి వయసు గానీ, వివాహం గానీ ఏమాత్రం అడ్డంకులు కావని ఆమె స్పష్టం చేశారు. జైపూర్ వేదికగా 'దివాలిషియస్' సంస్థ, మిసెస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి అందాల పోటీల్లో శృతి ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బషీర్‌బాగ్ లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తన విజయ విశేషాలను పంచుకున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే, తనకున్న ఆసక్తి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకున్నట్లు తెలిపారు. నేటి తరం మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, తమలోని నైపుణ్యాలను గుర్తించి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. తన ఈ ప్రయాణంలో కుటుంబ సభ్యులు, సమాజ పెద్దలు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, మహిళా సాధికారత కోసం తన వంతు కృషి చేస్తానని వివరించారు. జాతీయ వేదికపై విజేతగా నిలిచిన శృతి జోయ్‌జోడేను పలు సంఘాల నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా భావసార క్షత్రియ రంగరేజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జైతనే మాట్లాడుతూ సమాజంలోని యువత, మహిళలకు శృతి విజయం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భావసార క్షత్రియ రంగరేజ్ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ లోకండే, బీవీఐ అధ్యక్షురాలు అశ్విని పతంగే, భావసార క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యదర్శి అశ్విన్ కుమార్ పతంగే, హేమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా ఆర్థిక సహాయం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం : ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం, కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే కుటుంబానికి ఆర్థిక సహాయం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అందించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి లతో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ దార్శనికతతో ప్రజలకు మరింత భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 4 నుండి 5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశామని, ఇందులో భాగంగా మల్కాజ్‌గిరి పరిధిలో 25 వేల మందికి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 72 వేల మందికి పెన్షన్లు అందాయని వివరించారు. అలాగే పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణం, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని, నెల రోజుల పాటు వార్డులు, గ్రామాల్లో జరిగే ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రతి కుటుంబం ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి..

రాష్ట్రవ్యాప్తంగా 18 నుండి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల ఇంటి పెద్ద పేరు మీద రూ. 5 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పించబడుతుందని తెలిపారు. దురదృష్టవశాత్తు ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా సాధారణ జీవితాన్ని కొనసాగించేందుకు ఈ బీమా ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఇది యూనివర్సల్ కవరేజ్ పథకమని, రేషన్ కార్డు ఉన్నా లేకపోయినా ప్రతి కుటుంబం ఇందులో అర్హులేనని స్పష్టం చేశారు. బీమాకు సంబంధించి కుటుంబ సభ్యులలో ఒకరిని లేదా అంతకంటే ఎక్కువ మందిని (భార్య, కుమార్తె, కుమారుడు మొదలైనవారు) నామినీలుగా పెట్టుకునే అవకాశం ఉందని, మొత్తం 100 శాతం వాటాను కుటుంబ సభ్యుల మధ్య ఏ నిష్పత్తిలో పంచాలనే నిర్ణయాన్ని పూర్తిగా ఆ కుటుంబానికే వదిలివేయడం జరిగిందన్నారు. కుటుంబంలో మైనర్లు (18 ఏళ్ల లోపు వారు) ఉంటే వారికి సంరక్షకుడి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అలియాబాద్, ముచ్చింతలపల్లి, ఎల్ఎంపేట్ మున్సిపాలిటీలతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దరఖాస్తుదారులు కేవలం రేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు) నెంబరు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో క్యాంపుకు వస్తే కేవలం 5 నిమిషాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తవుతుందని, రేషన్ కార్డు లేనివారు ఆధార్ ఓటీపీ ద్వారా వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నమోదు పూర్తయిన వెంటనే దరఖాస్తుదారుడి మొబైల్ నెంబర్‌కు రసీదు మెసేజ్ వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జోనల్ కమీషనర్లు రాధిక గుప్తా, సంచిత్ గంగ్వార్, గ్రంథాలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, అలియాబాదు మున్సిపల్ ఛైర్మన్ శిరిషా, తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ దాసరి రాజు అజయ్ కుమార్, జిల్లా ఫిషరీస్ సొసైటీ ఛైర్మన్ మల్లె రాజు, ఇతర ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

అర్హత గల కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా : మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణలోనే తొలి సారి అమలు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట.



హైదరాబాద్ జిల్లా నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): జిల్లాలో అర్హత గల ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా భద్రత కల్పిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించి రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు బీమా పత్రాలను అందజేశారు. శుక్రవారం జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లా స్థాయి ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో గల ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. మాజీ ప్రధానమంత్రి భారత రత్నా ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా తెలంగాణ దేశంలోనే ఈ తరహా పథకాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా నిలిచిందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రత్యేక పథకాల పరిధిలో, ముఖ్యంగా రైతులకు మాత్రమే అందుబాటులో ఉన్న జీవిత బీమా రక్షణను వివిధ వృత్తులు, ఉపాధి రంగాలకు చెందిన సాధారణ కుటుంబాలకు సైతం విస్తరించడం ఈ పథకం ప్రత్యేకత అని వివరించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ పథకం, ఆపద సమయంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని, పిల్లల చదువులు, కుటుంబ బాధ్యతలు, జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో అర్హ కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడం ద్వారా ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించడం వల్ల లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, కష్టకాలంలో కుటుంబాలకు భరోసా, భద్రత కల్పించే అత్యంత ముఖ్యమైన సంక్షేమ కార్యక్రమమని అభివర్ణించారు. ఈ పథకం విజయవంతమైన అమలుకు అర్హులైన ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి, గరిష్ట స్థాయిలో నమోదు చేయించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు.



అర్హత కల ప్రతి కుటుంబానికి బీమాతో భరోసా..

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు ప్రక్రియలో భాగస్వామ్యం చేయడానికి హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ప్రాధాన్యతనిచ్చిందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 8,40,548 ఆహార భద్రతా కార్డులు ఉండగా, వాటి పరిధిలో 32,11,909 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు జిల్లాలోని 150 జీహెచ్ఎంసీ డివిజన్లు, 16 మండలాలు, 15 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18, 2026 వరకు దరఖాస్తుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబం నుంచి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక సంపాదనపరుడిని జీవిత బీమా కోసం ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆహార భద్రతా కార్డు, ఆధార్ వివరాలు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ వివరాలను సమర్పించాలని సూచించారు. అర్హులైన కుటుంబాలన్నీ నిర్దేశిత గడువులోగా ప్రత్యేక శిబిరాలను సందర్శించి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, దరఖాస్తుదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు బీమా ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, అదనపు కమిషనర్ సంతోష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ముఖ్య ప్రణాళిక అధికారి డాక్టర్ సురేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, ఇతర రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'గో సమ్మాన్ అభియాన్'కు కేంద్ర మంత్రులకు ఆహ్వానం : మర్యాదపూర్వకంగా కలిసిన లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతినిధి బృందం



న్యూఢిల్లీ ప్రతినిధి నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): సికింద్రాబాద్‌లోని హాకీ గ్రౌండ్‌లో డిసెంబర్ 11న నిర్వహించనున్న 'గో సమ్మాన్ అభియాన్' కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రులు రామ్‌దాస్ అథవాలే, గజేంద్ర సింగ్ షెకావత్‌లను లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతినిధి బృందం ఆహ్వానించింది. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌లను ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, అధ్యక్షుడు రిదేశ్ జాగిర్దార్, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.సి. రాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో-సేవ రంగంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను మంత్రులకు వివరించారు. గో-మాత పట్ల గౌరవం, గో-సంరక్షణ, సమాజంలో గో-సంస్కృతిపై అవగాహన కల్పించడమే 'గో సమ్మాన్ అభియాన్' ప్రధాన ఉద్దేశమని ప్రతినిధులు తెలిపారు. ఈ మహా అభియాన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న సాధుసంతులు, గో-భక్తులు, సామాజిక కార్యకర్తలు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఇరువురు కేంద్ర మంత్రులు ప్రత్యేకంగా అభినందించి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యాలయ జాయింట్ సెక్రటరీగా శ్యామ్ కిరణ్ రెడ్డి



కుత్బుల్లాపూర్ నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): భారతీయ జనతా యువమోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యాలయ జాయింట్ సెక్రటరీగా శ్యామ్ కిరణ్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నన్ను నియమించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నాకు ఈ బాధ్యతను అప్పగించిన రామచందర్ రావు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, గణేష్ కుండే బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, గిరివర్ధన్ రెడ్డి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు, మేడ్చల్ మల్కాజిగిరి ఎం.పీ.ఈటెల రాజేందర్ కి నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో, నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు.

మౌలిక వసతుల ఏర్పాటు మరింత అభివృద్ధికి తోడ్పాటు : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): జగద్గిరిగుట్ట డివిజన్ లో రూ.4.00 కోట్ల నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా దేవమ్మ బస్తి, మైసమ్మ నగర్, వాంబే కాలనీ, భూదేవి హిల్స్, మద్దూర్ నగర్, సీసాల బస్తి, రింగ్ బస్తి, భగత్ సింగ్ మార్గ్ వంటి ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధితోనే ప్రజల జీవన ప్రమాణాలు, మన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామని, రానున్న రోజుల్లో జగద్గిరిగుట్ట డివిజన్లోని ప్రతి కాలనీలో పూర్తిస్థాయి మౌలిక వసతులను అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, పార్టీ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, ఆయా కాలనీల వాసులు బసవేశ్వర్, మహేందర్, బ్రహ్మానంద చారి, ముఖేష్, రవి సాగర్, విటల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





స్పోర్ట్స్ బ్యూరో నవంబర్ 10 (ప్రభాత కిరణమ్ ప్రతినిధి): తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఈరోజు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎస్ గచ్చిబౌలి స్టేడియం, యూసుఫ్‌గూడ స్టేడియంలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు, క్రీడా మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, క్రీడారంగ అభివృద్ధి పట్ల వారి దార్శనికతకు అనుగుణంగా ఖేలో ఇండియా క్రీడలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే క్రీడాకారులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించాలని, స్టేడియంలలో అవసరమైన మౌలిక వసతులు, క్రీడా పరికరాలు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్రీడాకారులకు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మునగాకుతో ఆరోగ్యానికి ఎన్ని ప్రయోజనాలో తెలుసా



మనకు ప్రకృతి ఎన్నో విధాలుగా సాయపడుతుంది. ప్రకృతిసిద్ధంగా లభించే చెట్ల ద్వారా మనకు ఆహారంతోపాటు ఔషధాలు కూడా మెండుగా లభిస్తాయి. ఆహారంగా ఉపయోగపడే కొన్ని మొక్కలు మన ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అలాంటి వాటిలో మునగ కూడా ఒకటి. మునగాకు (వీశీతీఅఅస్ట్రు శ్రీమ్ఞజవం) ను ఆకు కూరగానో, పప్పులో కలెగూరగానో లేదంటే పచ్చడిగానో చేసుకుని తినడంవల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. మరి మునగాకుతో కలిగే ఆ ప్రయోజనాలు ఏంటో చూద్దాం.. ప్రయోజనాలు.. వర్షాకాలంలో మునగాకును ఎక్కువగా వాడటంవల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. అంతేగాక ఈ కాలంలో తరచుగా వచ్చే జలుబు, దగ్గులాంటి ఇబ్బందుల నుంచి కూడా బయటపడవచ్చు. పాలకూరతో పోలిస్తే మునగాకులో మూడు రెట్లు ఎక్కువగా ఐరన్ ఉంటుంది. అరటిపండు కంటే ఏడు రెట్లు ఎక్కువగా మెగ్నీషియం లభిస్తుంది. పాలల్లో కంటే రెండు రెట్లు ఎక్కువగా ప్రొటీన్లు ఉంటాయి. ఈ ఇనుము, మెగ్నీషియం మనల్ని త్వరగా అలసటకు గురికాకుండా చేస్తాయి. మునగాకులో ఎక్కువగా ఉండే పీచువల్ల కాస్త తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల మునగాకును నిత్యం వాడటంవల్ల అతిగా తినడం అనే సమస్య తీరుతుంది. మునగాకులో ఉండే క్లోరోజనిక్ ఆమ్లం కొవ్వును కరిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో సాయపడుతుంది.మునగలోని విటమిన్-ఎ చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. మునగాకులోని అమైనో ఆమ్లాలు ప్రొటీన్ ఉత్పత్తికి తోడ్పతాయి. ఈ ప్రొటీన్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. కడుపులోని పుండ్లు, ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌తో బ్లడ్ క్యాన్సర్‌కు చెక్



రక్త క్యాన్సర్ నిర్ధారణ అయినంత మాత్రాన జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదు. వైద్యరంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక చికిత్సలు ఎంతోమంది రోగులకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయి. సరైన వైద్య సలహా, సమయానికి చికిత్స, కుటుంబ సభ్యుల సహకారం, క్రమబద్ధమైన పర్యవేక్షణతో ఆరోగ్యకరమైన జీవితాన్ని తిరిగి ప్రారంభించవచ్చు. రక్త క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి. వైద్యరంగంలో వస్తున్న మార్పులతో బ్లడ్ క్యాన్సర్‌కు సరైన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయి. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఎముక మజ్జ మార్పిడి) లేదా స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (మూలకణ మార్పిడి).. బ్లడ్ క్యాన్సర్ రోగులకు కొత్త ఆశలు కల్పిస్తున్నది. లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా క్యాన్సర్ బాధితులకు సాధారణ జీవితాన్ని అందిస్తున్నది. రక్త క్యాన్సర్లతోపాటు అప్లాస్టిక్ అనీమియా, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వంటి జన్యుపరమైన, రోగ నిరోధక, మెటబాలిక్ వ్యాధులు తీవ్రంగా ఉన్నవారికి కూడా బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స ఉపయోగపడుతున్నది.

భోజనం బాగాలేదని రోడ్డెక్కిన ఓయూ విద్యార్థినులు



ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో తమకు అందిస్తున్న భోజనం నాణ్యంగా లేదంటూ విద్యార్థినులు రోడ్డెక్కారు. లేడీస్ హాస్టల్‌లో భోజనం సరిగా లేదంటూ ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భోజనానికి సంబంధించిన గిన్నెలు, అన్నం, కూరలతో సహా రోడ్డుపై బైఠాయించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చి తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చే వరకు అక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు.

ఎముకలకు పొగ దెబ్బ

సాధారణంగా ఎముకలు చిన్నప్పటి నుంచి బలపడతాయి. 20 నుంచి 30 ఏండ్ల మధ్య వయసులో ఎముకలు అత్యంత దృఢంగా మారుతాయి. 30 ఏండ్లు దాటినప్పటి నుంచి ఎముకల సాంద్రత పెరుగుదల ఆగిపోతుంది. అలాగే తగ్గుదల మొదలవుతుంది. ఇలా కాలక్రమేణా బలహీనపడే ఎముకలు కొందరిలో తొందరగా బలహీనపడతాయి. క్యాల్షియం ఉన్న ఆహారం తగినంత తినకపోతే సాధారణంగా ఎముకల సాంద్రత తగ్గుతుంది. ఆస్టియోపొరోసిస్ అనే వ్యాధి వస్తుంది. కొందరు క్యాల్షియం ఉన్న ఆహారం తిన్నా జీర్ణకోశ వ్యాధులు, ఎక్కువ కాలం బెడ్ రెస్ట్, మెనోపాజ్, విటమిన్ డి లోపం వల్ల కూడా క్యాల్షియం లోపాన్ని ఎదుర్కొంటారు. శరీరంలో క్యాల్షియం లోపానికి పరోక్షంగా కారణమయ్యే వ్యాధులు వచ్చినప్పుడు వైద్యులు ముందే హెచ్చరిస్తారు. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఇలాంటి సమస్యలు లేకున్నా కొంతమందిలో ఎముకలు తొందరగా బలహీనపడిపోతుంటాయి. రోజూ క్యాల్షియం ఉండే ఆహార పదార్థాలు బాగానే తింటున్నాం కాబట్టి, ఎముకలు బలంగా ఉన్నాయనుకుంటే పొరపాటే! పొగ తాగడం వల్ల శరీరం.. క్యాల్షియం సంగ్రహణ శక్తిని కోల్పోతుంది. ధూమపానం వల్ల ఊపిరితిత్తులు పాడవుతాయి. గుండె ఆరోగ్యం క్షీణిస్తుంది. కిడ్నీల పనితీరుపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇవే జనానికి ఎక్కువగా తెలుసు. కానీ, పొగతాగే అలవాటు ఎముకలపైనా ప్రభావం చూపిస్తుంది. ఎన్ని ఆహార నియమాలు పాటించినప్పటికీ, ఎముకల్ని కాపాడుకోవాలంటే.. పొగ మానేయాల్సిందేనని చెబుతున్నారు వైద్యులు.

దేశంలోని నగరాల్లో భారీగా పెరుగుతున్న వాయు కాలుష్యంఊపిరితిత్తులకు హాని కలిగిస్తాయంటున్న వైద్యులు



దీపావళి పండుగ సందర్భంగా కాల్చిన బాణసంచా ప్రభావంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గాలిలోని విషపూరిత కాలుష్య కణాల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన రోజువారీ పరిమితి కంటే 58 రెట్లకు పైగా నమోదైంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటైన ఢిల్లీలో దీపావళి పండుగను లక్షలాది మంది బాణసంచా కాల్చి జరుపుకుంటారు. ఇప్పటికే వాహనాల పొగ, పంట వ్యర్థాలను తగలబెట్టడం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా శీతాకాలంలో నగరాన్ని పొగమంచు కమ్ముకుంటోంది. ఈ పరిస్థితిని బాణసంచా కాల్చడం మరింత తీవ్రతరం చేస్తోంది.

ఊపిరితిత్తులకు హాని కలిగిస్తాయి..

ఈ నెలలో సుప్రీంకోర్టు తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసేలా రూపొందించిన పచ్చ బాణసంచాను పరిమితంగా వినియోగించేందుకు అనుమతించింది. అయినప్పటికీ, ఆంక్షలను చాలాచోట్ల పాటించకపోవడంతో దీపావళి రాత్రి నగరమంతా బాణసంచా పేలుళ్లతో మారుమోగింది. బాణసంచా కాల్చడం గరిష్ఠ స్థాయికి చేరుకున్న తర్వాత మండీర్ మార్గ్ ప్రాంతంలో గాలిలోని పీఎం 2.5 సూక్ష్మ కాలుష్య కణాల స్థాయి ప్రతి ఘనపు మీటరుకు 879 మైక్రోగ్రాములకు చేరింది. నగర ప్రభుత్వ పర్యవేక్షణ కేంద్రం నుంచి సేకరించిన వివరాలను ఐక్యూఎయిర్ సంస్థ వెల్లడించింది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన రోజువారీ గరిష్ఠ పరిమితి కంటే దాదాపు 59 రెట్లు ఎక్కువ. ఈ సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల్లోకి చేరి ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయి.

కాలుష్యం ఏర్పడేందుకు కారణాలు ఇవే..

కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ అధికారులు ఇటీవలి వారాల్లో వాహనాల రాకపోకలు, నిర్మాణ పనులపై పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. మూడు కోట్ల మందికి పైగా నివసించే ఈ నగరంలో శీతాకాలపు వాయు కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే పొగ 23 శాతం కారణమవుతోంది. పంట వ్యర్థాలను తగలబెట్టడం సహా జీవ పదార్థాలను కాల్చడం వల్ల 20 శాతం కాలుష్యం ఏర్పడుతోంది. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలతో సహా పరిశ్రమల వాటా సుమారు తొమ్మిది శాతంగా ఉంది. అయితే, వాహనాలు, పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, జీవ పదార్థాలను కాల్చడం వల్ల విడుదలయ్యే వాయువులు వాతావరణంలో రసాయనిక చర్యలకు లోనై ఏర్పడే ద్వితీయ సూక్ష్మ కణాలే అత్యధికంగా 27 శాతం కాలుష్యానికి కారణమవుతున్నాయి.

38 లక్షల మరణాలకు కారణం..

వాయు కాలుష్యం ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో 2024లో ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ పరిశోధనా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. 2009 నుంచి 2019 మధ్య కాలంలో భారత్‌లో సంభవించిన 38 లక్షల మరణాలకు వాయు కాలుష్యం సంబంధం ఉన్నట్లు ఈ అధ్యయనం అంచనా వేసింది. దీపావళి సమయంలో బాణసంచా వినియోగం ఇప్పటికే తీవ్రంగా ఉన్న కాలుష్యాన్ని మరింత పెంచుతుండడంతో, ప్రజారోగ్య పరిరక్షణకు కాలుష్య నియంత్రణ చర్యలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

పండుగల అనంతరం బరువు పెరుగుదలతో ఆందోళన వద్దు ఇలా చేయండి చాలు

పండుగల సమయంలో కొన్ని రోజుల పాటు మిఠాయిలు, నూనె పదార్థాలు, ఎక్కువ కేలరీలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల బరువు పెరిగినట్లు కనిపిస్తారు. అయితే రెండు కిలోల బరువు పెరిగిందంటే అంతా శరీరంలో కొవ్వు పెరిగినట్లుగా భావించకూడదు. పండుగ రోజుల్లో ఎక్కువగా తినడం, ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం, రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో శరీరంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుంది. అలాగే కాలేయం, కండరాల్లో గ్లైకోజన్ నిల్వలు పెరగడం వల్ల కూడా తాత్కాలికంగా బరువు పెరుగుతుంది. అధిక కేలరీల ఆహారం ఎక్కువ వారాల పాటు కొనసాగితేనే కొవ్వు పేరుకుపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల పండుగ తర్వాత ఆహారం మానేయడం, పండ్ల రసాలనే తీసుకోవడం, అన్నం వంటి కార్బోహైడ్రేట్లను పూర్తిగా తగ్గించడం లేదా కఠినమైన ఆహార నియమాలు పాటించడం సరైన పద్ధతి కాదు. వీటివల్ల మొదట్లో బరువు తగ్గినట్లు కనిపించినా కండరాల బలం, శక్తి, పోషకాలు తగ్గే ప్రమాదం ఉంటుంది.

పెరిగిన బరువంతా కొవ్వేనా.

మన శరీర బరువు కొవ్వు, కండరాలు, నీరు, గ్లైకోజన్ నిల్వలతో కలిసి ఉంటుంది. కార్బోహైడ్రేట్లను ఎక్కువగా తీసుకున్నప్పుడు కాలేయం, కండరాల్లో గ్లైకోజన్ నిల్వలు పెరుగుతాయి. ప్రతి గ్రాము గ్లైకోజన్‌తోపాటు కొంత నీరు కూడా నిల్వ ఉంటుంది. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు కూడా శరీరంలో ద్రవాలు పేరుకుపోతాయి. సాధారణ ఆహారపు అలవాట్లు, వ్యాయామం తిరిగి ప్రారంభించిన తర్వాత ఈ మార్పులు క్రమంగా తగ్గుతాయి. అయితే శరీరం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ కేలరీలు నిరంతరం తీసుకుంటే అదనపు శక్తి కొవ్వుగా నిల్వ అవుతుంది. బరువుతోపాటు నడుము చుట్టుకొలతను కూడా గమనించాలి. ముఖ్యంగా పొట్టలోని అంతర్గత కొవ్వు ఇన్సులిన్ నిరోధకత, ఇతర జీవక్రియ సంబంధిత సమస్యలతో ముడిపడి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు, కొవ్వు పదార్థాల స్థాయిలు, కాలేయ పనితీరు పరీక్షలు కూడా ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

ప్రోటీన్లు సరిగ్గా లభించకపోతే

అతి తక్కువ కేలరీలు తీసుకునే ఆహార నియమాలు బరువు తగ్గడానికి సరైన మార్గం కావు. ప్రోటీన్ తగినంతగా అందకపోతే



కొవ్వుతోపాటు కండరాలు కూడా తగ్గుతాయి. కండరాలు శరీరక బలాన్ని అందించడమే కాకుండా రక్తంలో చక్కెర నియంత్రణలోనూ ముఖ్యపాత్ర పోషిస్తాయి. పదేపదే కఠినమైన ఆహార నియమాలు పాటించడం వల్ల దీర్ఘకాలంలో బరువును నియంత్రించడం కష్టమవుతుంది. బరువు తగ్గాలంటే శరీరానికి అవసరమైన దానికంటే కొద్దిగా తక్కువ కేలరీలు తీసుకుంటూ, తగినంత ప్రోటీన్‌తోపాటు కార్బోహైడ్రేట్లు, కొవ్వులు సమతుల్యంగా ఉండే ఆహారం తీసుకోవాలి. డీటాక్స్ టీలు, జ్యూస్‌లతో చేసే శుభ్రపరిచే పద్ధతులు, కాలేయాన్ని శుద్ధి చేస్తాయని చెప్పే మందులు కూడా బరువు తగ్గించే పరిష్కారాలు కావు. కాలేయం, మూత్రపిండాలు శరీరంలోని వ్యర్థాలను తొలగించే పనిని నిరంతరం చేస్తుంటాయి. జ్యూస్‌లతో మాత్రమే ఉండే ఆహారంలో ప్రోటీన్, పీచు పదార్థాలు తక్కువగా ఉంటాయి. విరేచనాలు లేదా మూత్ర విసర్జన పెంచే పదార్థాలు తాత్కాలికంగా శరీరంలోని నీటిని తగ్గిస్తాయి తప్ప కొవ్వును తగ్గించవు. కొన్ని మూలికా పదార్థాలు వాడే మందులతో ప్రతికూల ప్రభావాలు చూపిస్తాయి. ముఖ్యంగా ఫ్యాటీ లివర్, మధుమేహం, అధిక రక్తపోటు లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా లేకుండా ఇలాంటి ఉత్పత్తులు వాడకూడదు.

పండుగల తరువాత ఏం చేయాలి

పండుగ తర్వాత ముందుగా సాధారణ భోజనపు అలవాట్లకు తిరిగి రావాలి. ప్రతి ప్రధాన భోజనంలో ప్రోటీన్ అందించే ఆహారంతోపాటు కూరగాయలు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. పండ్లు తీసుకోవడం వల్ల పీచు పదార్థాలు అందడమే కాకుండా తీపి పదార్థాలపై కోరికను నియంత్రించడంలో సహాయపడుతాయి. నడక, ఈత, సైక్లింగ్ వంటి వ్యాయామాలు గుండె ఆరోగ్యానికి, ఇన్సులిన్ పనితీరుకు మేలు చేస్తాయి. బరువు తగ్గే సమయంలో కండరాలు తగ్గకుండా ఉండేందుకు బలవర్ధక వ్యాయామాలు కూడా అవసరం. నిద్ర సరిగా లేకపోవడం ఆకలి, ఆహారపు అలవాట్లపై ప్రభావం చూపుతుంది కాబట్టి తగినంత నిద్ర కూడా ముఖ్యం. బరువు నిరంతరం పెరుగుతుంటే శరీర ద్రవ్యరాశి సూచీ, నడుము కొలత, రక్తంలో చక్కెర, కొవ్వు పదార్థాలు, కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి. జీవనశైలి మార్పులు, వ్యాయామం, వైద్య చికిత్సతోనూ ఆశించిన ఫలితం రాని స్థూలకాయం ఉన్నవారికి నిపుణుల పరిశీలన తర్వాత బేరియాట్రిక్ శస్త్రచికిత్సను పరిశీలించవచ్చు.

శస్త్ర చికిత్సలతో ప్రయోజనం ఉంటుందా..

ఈ శస్త్రచికిత్స వల్ల మధుమేహం నియంత్రణలోనూ ప్రయోజనం ఉంటుందని అధ్యయనాలు వెల్లడించాయి. ఐదేళ్ల స్టాంపీడ్ అధ్యయనంలో గ్యాస్ట్రిక్ బైపాస్ చేయించుకున్న వారిలో 29 శాతం మంది, స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ చేయించుకున్న వారిలో 23 శాతం మంది హెచ్‌బీఏ1సీ స్థాయిని ఆరు శాతం లేదా అంతకంటే తక్కువకు తీసుకురాగలిగారు. వైద్య చికిత్స పొందిన వారిలో ఈ సంఖ్య ఐదు శాతంగా ఉంది. అలాగే 12 ఏళ్ల పాటు కొనసాగిన ఆర్బ్-టీ2డీ అధ్యయనంలో శస్త్రచికిత్స చేయించుకున్నవారు సగటున 19.3 శాతం బరువు తగ్గగా, మందులు, జీవనశైలి మార్పులు పాటించినవారిలో ఈ తగ్గుదల 10.8 శాతంగా నమోదైంది. అయితే శస్త్రచికిత్స అవసరమా లేదా అనేది వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, స్థూలకాయం తీవ్రత, ఇతర అనారోగ్య సమస్యలు, గత చికిత్సల ఫలితాలను పరిశీలించిన తర్వాతే వైద్యులు నిర్ణయిస్తారు. పండుగ తర్వాత కొన్ని రోజుల బరువు పెరుగుదలను చూసి ఆందోళన చెందకుండా సమతుల్య ఆహారం, క్రమమైన వ్యాయామం, ఆరోగ్యకరమైన దినచర్యను తిరిగి ప్రారంభించడం ఉత్తమమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

పథ్యం చేయాలా వద్దా ఆయుర్వేదంలో ఆహార నియమాల అసలు రహస్యం ఇదే



అమర కోశం ప్రకారం.. పథ్యం అంటే హితకరమైనది. మనకు అనుకూలమైనది. అపథ్యం అంటే అహితకరమైనది. అనుకూలమైన పథ్యాలు, అనుకూలం కాని పథ్యాలు అన్నీ వైద్యశాస్త్రంలో ఉంటాయి. మధుమేహ రోగులకు పిండి పదార్థాలు, మధుర పదార్థాలు, తియ్యని పానీయాలు అపథ్యం అని ఆయుర్వేదం చెప్పింది. తీయని పదార్థాలు ఎకువగా తీసుకోవడం అనేది మధుమేహానికి కారణమని కూడా చెప్పారు. ఇప్పటి వైద్యం ఇంతకుమించి ఏం చెప్పలేదు.లోలాంబరాజు రచించిన వైద్య జీవనం అనే గ్రంథంలో పథ్యం గురించి ఎంతో ఆధునికంగా వివరించారు. హెల్త్ కేర్ రంగంలో ఆహారం, జీవనశైలి, ప్రాముఖ్యత గురించి చాలా అద్భుతంగా చెప్పారు. దినచర్యలో భాగంగా శరీర ధర్మాన్ని బట్టి, రుతువులను అనుసరించి గట్ హెల్త్‌ని ఇబ్బంది పెట్టకుండా ఆహారాన్ని తీసుకుంటే ఔషధాల అవసరం ఏముంటుంది? సమతుల ఆహారం తీసుకోకపోతే ఎన్ని మందులు వాడినా ఎలాంటి ప్రయోజనం ఉండదు.నాటు వైద్యాలు, ట్రైబల్ వైద్యాలు, గచ్చకు-పిచ్చాకు వైద్యాలతో ప్రాక్టీస్ చేసేవారు నిరంతరం చెప్పేదొకటే. గొడ్డుకారంతో అన్నం తినండి, దుంపలు తినకండి, వంకాయ తినకండి, పచ్చళ్లు తినకండి, ఒట్టి చేపలు తినకండి, గుమ్మడికాయ తినకండి.. అంటూ పథ్యం పేరుతో తినకూడని అంశాలు చెబుతూ ఉంటారు. చేయాల్సిన పనుల కింద చేయకూడని పనుల గురించి చెబుతారు. కొంతమంది ఆయుర్వేద వైద్యులు కూడా ఇలాగే చెప్పడం మొదలుపెట్టారు. దీనికి తోడు ఇంగ్లిష్ వైద్యుల దుష్ప్రచారం, ప్రతిఘటించే వాళ్లు లేకపోవడం ఇతరత్రా కారణాలవల్ల ఆయుర్వేదంలో పథ్యం ఓ బ్రహ్మ పదార్థంలా మారింది. పథ్యం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. దీన్ని లోతుగా అర్థం చేసుకోవడం అవసరం. 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ' అన్నట్లు.. అపోహలు పెట్టుకునే వారు కూడా తమ చుట్టూ ఆయుర్వేదం వాడిన వాళ్ల అనుభవాలు సేకరించుకోవాల్సిన అవసరం ఉంది. ఏమీ తెలుసుకోకుండా కేవలం ఒక వైద్యశాస్త్రం చెప్పిందే వేదమని నమ్మడం వల్ల, నిజమైన ఆయుర్వేద అభివృద్ధిని దూరం చేసుకోవడం వల్ల ప్రజలే నష్టపోతారు. ఆయుర్వేద చికిత్సతో కీళ్ల వాతం, కీళ్లు గట్టిపడి చేతులు ఎత్తలేక పోవడం, ఆర్థరైటిస్, లివర్ జబ్బులు, వెన్ను నొప్పి సమస్యలు, క్లోమ గ్రంథి పైన వాపు తదితర రుగ్మతలు చాలా బాగా తగ్గుతున్నాయి. అనేక కారణాల వల్ల దెబ్బతిన్న జీవశక్తి.. ఆయుర్వేదంతో కరెక్ట్ అవుతుంది. గట్ హెల్త్ గణనీయంగా అభివృద్ధి చెందుతుంది. లివర్ పనితీరు మెరుగవుతుంది. మందులు అవసరం లేకుండా గ్యాస్, ఎసిడిటీ తగ్గి ప్రశాంతమైన నిద్ర పడుతుంది. శరీరం తేలికపడి ఆరోగ్యకరమైన నడక మొదలవుతుంది. చాలా ఆయుర్వేద ఔషధాలలో గుగ్గులు ఉండటం వల్ల రక్తనాళాలలో పేరుకుపోయిన కొవ్వు తగ్గుతుంది. ఎలాంటి ఎక్స్‌ట్రా డైటింగ్ అవసరం లేకుండానే శరీర బరువు తగ్గుతారు. పూర్వం వైద్యులు చికిత్సలో భాగంగా పథ్యం కూరలు తీసుకోమని చెప్పేవారు. నీరు నిండిన కాయగూరలు సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, దొండ, బెండ, తెల్ల గుమ్మడి, గోరుచిక్కుడు, లేత బీన్స్, మునకాడలు, కాకర లాంటివి తినాలని సూచించేవారు. పులుపు, కారం, మసాలాలు, తగ్గించమని చెప్పేవారు. పెరుగు బదులు మజ్జిగ, పప్పు కట్టు, ఉడకబెట్టిన గుడ్లు, మాంసాహారంలో చేపలు తినాలనేవారు. ఇలాంటి పథ్యం అల్లోపతి వైద్యులు కూడా చెబుతూ ఉంటారు. ఎలా వచ్చి చేరిందో కానీ, ఒక భావజాలం ఆయుర్వేదాన్ని అల్లిబిల్లిగా అల్లుకుంది. అవి తొలగిస్తే నిజమైన ఆయుర్వేదం వెలుగులోకి వస్తుంది. కుప్రచారం కుపరీక్షితం లాగా ఏది పరీక్షించకుండా, ఏదీ చూడకుండా, ఏది సరిగ్గా అర్థం చేసుకోకుండా, గుడ్డిగా నమ్మకూడదని పంచతంత్రం చెబుతుంది. రోగం ముదిరిన తర్వాత ఆయుర్వేదాన్ని ఎంచుకునే కంటే.. ముందస్తుగానే ఈ వైద్యాన్ని ఆశ్రయిస్తే మనకు ఎంతో మేలు జరుగుతుంది.

ప్రపంచం మెచ్చిన భారతీయ స్ట్రీట్ ఫుడ్..

ఈ నగరాల్లో ఏం తినాలో తెలుసా?



భారతీయ స్ట్రీట్ ఫుడ్ అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. తక్కువ ధరలో అద్భుతమైన రుచులను అందించే భారతీయ వీధి ఆహారానికి విదేశీయులు సైతం ఫిదా అవుతుంటారు. తాజాగా ప్రపంచంలోని ఉత్తమ స్ట్రీట్ ఫుడ్ నగరాల జాబితాలో భారత్‌కు చెందిన మూడు ప్రముఖ నగరాలు చోటు దక్కించుకోవడం విశేషం. ఆ ఫేమస్ రుచులేంటో చూసేద్దామా మరి.. ఈ జాబితాలో ముంబై, జైపూర్, న్యూఢిల్లీ నగరాలు తమ ప్రత్యేక వీధి ఆహార సంస్కృతితో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. స్థానిక రుచులు, వైవిధ్యమైన వంటకాలు, అందుబాటు ధరలే ఈ నగరాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని పేర్కొన్నారు.

1. ముంబై స్ట్రీట్ ఫుడ్‌కు కేరాఫ్ అడ్రస్

భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ముంబై స్ట్రీట్ ఫుడ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. వడా పావ్, పావ్ భాజీ, భేల్ పూరి, సేవ్ పూరి, రగ్డా ప్యాటీస్, కుల్ఫీ వంటి వంటకాలు దేశ విదేశాల పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఖౌ గల్లీలు, జుహూ బీచ్, గిర్గాం చౌపట్టి వంటి ప్రాంతాలు ఫుడ్ లవర్స్‌కు స్వర్గధామంగా పేరుగాంచాయి.

2. జైపూర్ రాజస్థానీ రుచులకు ప్రపంచ గుర్తింపు

రాజస్థాన్ రాజధాని జైపూర్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. ప్యాజ్ కచోరీ, మావా కచోరీ, మిర్చి బడా, దాల్ బాటి చూర్మా, ఘేవర్ వంటి సంప్రదాయ వంటకాలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. రాజస్థానీ వంటకాల అసలైన రుచిని ఆస్వాదించాలంటే జైపూర్ తప్పక వెళ్లాల్సిన నగరంగా ఫుడ్ నిపుణులు చెబుతున్నారు.

3. న్యూఢిల్లీ చాట్‌లకు పెట్టింది పేరు

దేశ రాజధాని న్యూఢిల్లీ కూడా ప్రపంచ ఉత్తమ స్ట్రీట్ ఫుడ్ నగరాల జాబితాలో స్థానం సంపాదించింది. చాందినీ చౌక్, కరోల్ బాగ్, కనాట్ ప్లేస్ వంటి ప్రాంతాల్లో దొరికే గోల్‌గప్పా, ఆలూ చాట్, చోలే భటూరే, పరాఠాలు, కబాబ్‌లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

4. భారతీయ స్ట్రీట్ ఫుడ్‌కు ఎందుకంత క్రేజ్?

భారతీయ వీధి ఆహారం తక్కువ ధరలో రుచికరంగా ఉండటమే కాకుండా, ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన వంటకాలను అందిస్తుంది. స్థానిక మసాలాలు, సంప్రదాయ వంట పద్ధతులు, తాజా పదార్థాలతో తయారయ్యే ఈ వంటకాలు ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

5. ఫుడ్ లవర్స్ తప్పక సందర్శించాల్సిన నగరాలు

వీధి ఆహారం అంటే ఇష్టమైతే ముంబై, జైపూర్, న్యూఢిల్లీ నగరాలను జీవితంలో కనీసం ఒక్కసారైనా సందర్శించాలని పర్యాటక, ఫుడ్ నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కో నగరం ఒక్కో ప్రత్యేక రుచితో భారతీయ ఆహార వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తోంది. గమనిక: ఈ కథనం అంతర్జాతీయ ఫుడ్ ర్యాంకింగ్స్, పర్యాటక నివేదికలు మరియు అందుబాటులో ఉన్న సమాచార ఆధారంగా రూపొందించబడింది. ర్యాంకులు, జాబితాలు ఆయా సంస్థలు అనుసరించే ప్రమాణాల ప్రకారం మారే అవకాశం ఉంది.

హమ్మయ్య ఎట్టకేలకు దిగొచ్చాయి! తగ్గిన

కూరగాయల ధరలు ఇదిగో లేటెస్ట్ రేట్లు ఇవే!



హైదరాబాద్‌లోని ప్రజలకు ఇదో ఊరటనిచ్చే వార్తనే చెప్పాలి. ఎందుకంటే గత నెలరోజులుగా ముట్టుకుంటే భగ్గుమన్న కూరయల ధరలు ప్రస్తుతం తగ్గముఖం పట్టాయి. హైదరాబాద్‌లో కూకట్‌పల్లి సహా ప్రధాని రైతు బజార్‌లలో అన్ని కూరగాయలు ప్రజలకు అందుబాటు ధరల్లోనే లభిస్తున్నాయి. కాబట్టి ఇవాళ కూకట్‌పల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఎలా ఉన్నయో చూద్దాం. హైదరాబాద్‌లోని ప్రజలకు ఇదో ఊరటనిచ్చే వార్తనే చెప్పాలి. ఎందుకంటే గత కొన్ని రోజుగా ముట్టుకుంటే అంటుకుంటాయోమో అనే స్థాయిలో ఉన్న కూరగాయల ధరలు ఇప్పుడు దిగొచ్చాయి. గత రెండు మూడు వారాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో కాపు కూడా పెరిగిన రైతు మార్కెట్‌లకు వచ్చే కూరగాయల సరఫరా కూడా పెరిగింది. దీంతో అవసరారిని సరిపడా కూరగాయలు అందుబాటులో ఉండడంతో ధరలు కూడా దిగొచ్చాయి. దీంతో హైదరాబాద్‌లోని కుకట్‌పల్లిలోని మోదరన్ అండ్ మోడల్ రైతుబజార్‌తో సహా నగర వ్యాప్తంగా ఉన్న చాలా రైతు బజార్లో కూర గాయల ధరలు ప్రజలకు ఆశించిన మేరే కనిపిస్తున్నాయి.

ఈరోజు అంటే (04.08.2026) మంగళవారం విక్రయించే రోజువారీ కూరగాయల అధికారిక ధరల జాబితాను ఎస్టేట్ ఆఫీసర్ విడుదల చేశారు. వినియోగదారులకు తాజా కూరగాయలు అందుబాటు ధరల్లో లభించేలా ఈ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ధరలను ఈ క్రింది విధంగా నిర్ణయించారు.

కూకట్‌పల్లి రైతు బజార్‌లో మంగళవారం ధరలు ఇవే

ప్రధాన కూరగాయలైన టమాటా కేజీ రూ. 17 ఆలుగడ్డ కేజీ రూ.19, ఉల్లిగడ్డ కేజీ రూ. 34 కి విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇక బెండకాయ:రూ.40, పంకాయ:రూ.35 , పచ్చి మిర్చి:రూ.45 , కాకరకాయ:రూ.40, బీరకాయ:రూ.38 , క్యాబేజీ:రూ.18 , క్యారెట్:రూ.41 , గోబిపువ్వు :రూ.25, దోసకాయ:రూ.18, సొరకాయ:రూ.15, పొట్లకాయ:రూ.23 గా విక్రయిస్తున్నారు. అలాగే దొండకాయ:రూ.45 , బీన్స్:రూ.80 , చిక్కుడుకాయ:రూ.50 , గోరుచిక్కుడు:రూ.35 , బీట్ రూట్:రూ.35 , క్యాప్సికం:రూ.40 కీరా (లోకల్):రూ.23, కీరా రూ.45 విక్రయిస్తున్నారు. ఉల్లిపొరక:రూ.55 , కంద:రూ.40 । చామగడ్డ:రూ.35 । చిలగడ దుంప:రూ.35 , గుమ్మడికాయ:రూ.40 లకు అమ్ముతున్నారు. ఇక ఇతర దినుసులు, పండ్లు, మసాలా దినుసులు ధరలు చూసుకుంటే.. పాత అల్లం కేజీ రూ.220, వెల్లుల్లి కేజీ:రూ.260 ఎండు మిర్చి:రూ.260, పండు మిర్చి:రూ.80 , చింతపండు:రూ.160 , ఆ కాకరకాయ:రూ.135, ఉసిరి:రూ.100, పల్లికాయ :రూ.70, పర్వల్:రూ.65 , లోబా:రూ.23, కరివేపాకు:రూ.50, బొప్పాయి:రూ.40, పుట్టగొడుగులు రూ. 45లకు విక్రయిస్తున్నారు. గమనిక: అయితే అన్ని ప్రాంతాల్లో ఈ ధరలు ఒకేలా ఉండకపోవచ్చు. ఎందుకంటే రైతు బజార్‌లలో నేరుగా రైతుల నుంచి కూరగాయలు విక్రయించబడటం వల్ల మార్కెట్‌తో పోలిస్తే కొంత తక్కువ ధరలకు కూరగాయలు దొరుకుతాయి. అయితే సరఫరా, డిమాండ్‌ను బట్టి ఎప్పికప్పుడూ ధరల్లో మార్పులు ఉంటాయి. కాబట్టి కొనే ముందు తాజా ధరలను ఒకసారి చెక్ చేసుకోండి.

విమానం ఎక్కాలన్న మీ కల ఫ్రీగా తీర్చుకోండి!

20,000 ఉచిత టిక్కెట్లు ఇస్తున్న ఇండిగో



ఇండిగో 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రయాణికులకు భారీ ఆఫర్ ప్రకటించింది. ఆగస్టు 4 నుంచి 6, 2026 మధ్య అధికారిక ఛానెళ్ల లో దేశీయ విమాన టిక్కెట్లు బుక్ చేస్తే, 20,000 మంది వరకు ఉచిత టిక్కెట్లు గెలుచుకునే అవకాశం ఉంది. దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో తన 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. హ్యాపీ ఇండిగో డే.. ఇండిగోఫ్రీ పేరుతో తీసుకొచ్చిన ఈ ఆఫర్‌లో భాగంగా మొత్తం 20,000 ఉచిత విమాన టిక్కెట్లను అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఒక్కో పీఎన్ఆర్‌కు గరిష్ఠంగా రూ.10,000 వరకు బుకింగ్ మొత్తాన్ని తిరిగి చెల్లించే అవకాశం ఈ ఆఫర్‌లో ఉంది.

ఎప్పుడు బుక్ చేస్తే ఆఫర్ వర్తిస్తుంది?

ఈ ప్రత్యేక ఆఫర్ 2026 ఆగస్టు 4 నుంచి ఆగస్టు 6 వరకు చేసిన దేశీయ విమాన బుకింగ్‌లకు మాత్రమే వర్తిస్తుంది. ప్రయాణికులు ఇండిగో అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ లేదా 6ఇంఎఅ ూ× వర్చువల్ అసిస్టెంట్ ద్వారా నేరుగా టిక్కెట్లు బుక్ చేసుకోవాలి. ఇతర థర్డ్-పార్టీ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చేసిన బుకింగ్‌లకు ఈ ఆఫర్ వర్తించదు.

ఫ్రీ టిక్కెట్ ఎవరికి ఇస్తారు?

ఆఫర్ వ్యవధిలో చేసిన అర్హత కలిగిన బుకింగ్‌ల నుంచి కంపెనీ ర్యాండమ్‌గా ప్రయాణికులను ఎంపిక చేస్తుంది. ఎంపికైన వారికి ఇండిగో నుంచి ఈమెయిల్, వాట్సాప్ ద్వారా ఒక సందేశం వస్తుంది. అందులో ఒక సులభమైన ప్రశ్న అడుగుతారు. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వడానికి ప్రయాణికులకు మూడు అవకాశాలు ఉంటాయి.

రిఫండ్ ఎలా లభిస్తుంది?

ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చిన అర్హులైన ప్రయాణికులకు వారి బుకింగ్ చార్జీలను ఒక్కో పీఎన్ఆర్‌కు గరిష్ఠంగా రూ.10,000 వరకు తిరిగి చెల్లిస్తారు. ఈ రిఫండ్ సాధారణంగా 3 నుంచి 5 పని దినాల్లో వారి చెల్లింపు విధానానికే జమ అవుతుందని ఇండిగో తెలిపింది.

ఏ బుకింగ్‌లకు వర్తిస్తుంది?

ఈ ఆఫర్ వన్-వే, రిటర్న్ ప్రయాణాలకు రెండింటికీ వర్తిస్తుంది. అలాగే అన్ని దేశీయ ఎకానమీ క్లాస్, ఇండిగోస్ట్రెచ్ బుకింగ్‌లు కూడా ఈ ఆఫర్ పరిధిలోకి వస్తాయి. అయితే అర్హత, ఎంపిక విధానం, ఇతర నిబంధనలు కంపెనీ ప్రకటించిన షరతుల ప్రకారం అమలులో ఉంటాయి.

20 ఏళ్ల ప్రయాణానికి గుర్తుగా ప్రత్యేక కానుక

భారతదేశంలో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటిగా ఎదిగిన ఇండిగో, 20 ఏళ్ల విజయవంతమైన ప్రయాణాన్ని వినియోగదారులతో కలిసి జరుపుకోవడానికి ఈ ప్రత్యేక ఆఫర్‌ను తీసుకొచ్చింది. దేశీయ ప్రయాణికులకు అదనపు ప్రయోజనం కల్పించడమే కాకుండా, సంస్థపై వినియోగదారుల విశ్వాసానికి కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఇండిగో తెలిపింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 4 నుంచి 6 మధ్య ఇండిగో అధికారిక ఛానెళ్ల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే

యూపీఐ వాడేవారికి బ్యాడ్‌న్యూస్ రూ.2 వేలు దాటితే ఛార్జీలు కట్టాల్సిందే కేంద్రం సంచలన నిర్ణయం



యూపీఐ వాడేవారికి కేంద్రం షాకిచ్చింది. ఎండీఆర్ ఛార్జీలను విధించాలని నిర్ణయం తీసుకుంది. త్వరలోనే దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. యూపీఐ ప్లాట్‌ఫామ్ నుంచి ఎప్పటినుంచో ఎండీఆర్ ఛార్జీలపై డిమాండ్లు వినిపిస్తున్నాయి. దేశంలో డిజిటల్ విప్లవానికి బాటలు వేసిన యూపీఐ రూపే లావాదేవీలపై త్వరలో అదనపు ఛార్జీలు పడే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న తాజా సవరణ బిల్లుతో మర్చంట్ డిస్కౌంట్ రేట్ చార్జీల వసూలుకు మార్గం సుగమం అవుతుంది. ఈ నిర్ణయం ఎవరిపై ప్రభావం చూపుతుంది? ఆర్థిక శాఖ ప్రతిపాదనల వివరాలు ఇక్కడ చూద్దాం.

దేశంలో డిజిటల్ చెల్లింపుల రంగాన్ని ఊపేస్తున్న యూపీఐ లావాదేవీలపై మళ్లీ 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' విధించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ వారంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న 'టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు, 2026' లో భాగంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక మార్పులు చేయనుంది. 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007' లోని సెక్షన్ 10ూకు సవరణ చేయడం ద్వారా పెద్ద వ్యాపారులకు ఇచ్చే బ్యాంక్ ఛార్జీల మినహాయింపును తొలగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

తాజా ప్రతిపాదనల వివరాలు

రూ. 2,000 దాటితే ఛార్జీలు: రూ. 2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే రూపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై దాదాపు "0.5%" వరకు ఎండీఆర్ ఛార్జీ పడే అవకాశం ఉంది.

ఎవరిపై ప్రభావం?: రూ. 50 కోట్ల కంటే ఎక్కువ వార్షిక టర్నోవర్ కలిగిన అమెజాన్ ఫ్లిప్‌కార్ట్‌వంటి భారీ ఈ-కామర్స్ దిగ్గజాలు, పెద్ద వ్యాపారులకుమాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయి.

చిన్న వ్యాపారులు, సామాన్యులకు ఊరట: రూ. 2,000 లోపు ఉండే లావాదేవీలకు ఎండీఆర్ నుంచి పూర్తిగా మినహాయింపు ఉంటుంది.

ఫైనాన్స్ కమిటీ నివేదికలో ప్రతిపాదనలు:

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ ఈ ఏడాది మార్చి నివేదికలో కీలక విషయాలను వెల్లడించింది: లావాదేవీల విలువ: ప్రస్తుతం మొత్తం యూపీఐ చెల్లింపుల విలువలో 67% మేర రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలే ఉన్నాయి.

భారీ నష్టం: 2021-22 నుంచి 2024-25 వరకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ ప్రోత్సాహకాలు డిజిటల్ పేమెంట్ పరిశ్రమ భరించిన నిర్వహణ వ్యయంలో కేవలం 11% మాత్రమే. ఒకవేళ ఎండీఆర్ అనుమతించి ఉంటే వచ్చే రాబడిలో ఇది కేవలం 14%తో సమానం. దీనివల్ల పేమెంట్ సిస్టమ్ కంపెనీలు ప్రాసెసింగ్, సెటిల్‌మెంట్, మౌలిక వసతుల నిర్వహణకు తీవ్రంగా నష్టపోతున్నాయని కమిటీ పేర్కొంది.

రికార్డు లావాదేవీలు: ఒక్క జూలై నెలలోనే దేశంలో 2,236 కోట్ల లావాదేవీలు జరగ్గా, వాటి విలువ ఏకంగా రూ. 29.88 లక్షల కోట్లుగా నమోదైంది.

చట్టపరమైన మార్పులు ఏంటి?

ప్రస్తుత నిబంధనల ప్రకారం.. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్‌లోని సెక్షన్ ప్రకారం =బూఖఎ డెబిట్ కార్డులు, -కోడ్‌ల ద్వారా జరిగే చెల్లింపులపై బ్యాంకులు లేదా సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకూడదు. అయితే, ఆదాయపన్ను చట్టం 1961లోని సెక్షన్ 269ూఖ నిబంధనలకు సవరణలు చేయడం ద్వారా రూ. 50 కోట్ల కంటే ఎక్కువ టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థలపై ఈ మినహాయింపును తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత 2020లో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు వీణ=ను సున్నా చేయగా, ఇప్పుడు వ్యవస్థ సుస్థిరత కోసం పెద్ద వ్యాపారుల నుంచి తిరిగి రుసుములు వసూలు చేసేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది.

కరెంట్ బిల్లు మీ పేరు మీదకు మార్చుకోవాలా..?

జస్ట్ రూ.25 కడితే చాలు ఆన్‌లైన్‌లో చాలా ఈజీ

కరెంట్ బిల్లు మీ పేరు మీదకు మార్చుకోవాలా.. చాలామందికి ఈ ప్రాసెస్ ఎలానో తెలియక దళారులను ఆశ్రయిస్తుంటారు. దళారులకు వేలకు వేలు అప్పగిస్తూ ఉంటారు. అయితే వారికి ఒక్క రూపాయి కర్షీదా ఇవ్వాల్సిన పని లేదు. మీరు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా సులువుగా మార్చుకోవచ్చు. చాలామంది నగరాలు, పట్టణాల్లో శాశ్వతంగా ఇల్లు, ఫ్లాట్ లాంటివి కొనుగోలు చేస్తూ ఉంటారు. కూడబెట్టుకున్న డబ్బులతో కొనుగోలు చేసి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటారు. అయితే కరెంట్ బిల్లులో ఇంటి లేదా బిల్డింగ్, ఫ్లాట్ యజమాని పేరు ఉంటుంది. శాశ్వతంగా ఇంటిని కొనుగోలు చేసిన సందర్భంలో విద్యుత్ బిల్లులో మీ పేరు లేకపోవడం వల్ల పర్మినెంట్ అడ్రస్ ప్రూఫ్ అనేది మీకు ఉండదు. దీంతో మీరు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో మీ పేరుపైకి కరెంట్ బిల్లు మార్చుకోవడం వల్ల మీకు పర్మినెంట్ అడ్రస్ ప్రూఫ్ ఉండటంతో పాటు అనేక పనులకు ఉపయోగపడుతుంది. అయితే ఇది ఎలా మార్చుకోవాలనేది చాలామందికి తెలియక వదిలేస్తుంటారు. కేవలం రూ.25తో సులువుగా కరెంట్ బిల్లులో మీ పేరు వచ్చేలా చేసుకోవచ్చు. ఈ సింపుల్ ఆన్‌లైన్ ప్రాసెస్ ఏంటి అనేది ఇప్పుడు చూద్దాం.

ఏయే డాక్యుమెంట్స్ అవసరం

రిజిస్టర్డ్ సేల్ డీడ్ లేదా గిఫ్ట్ డీడ్, ఏదైనా గుర్తింపు ధృవీకరణ పత్రం, రూ.100 నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్‌తో కూడిన ఇండెమ్నిటీ బాండ్, లేటెస్ట్ కరెంట్ బిల్లు, పాస్ పోర్ట్ సైజు ఫొటో అవసరం. వీటిని ఆన్‌లైన్‌లో పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి.

ఆన్‌లైన్ ద్వారా మార్చుకోవడం ఎలా..?

తెలంగాణలో అయితే https://tgsouthernpower.org/ వెబ్‌సైట్లోకి వెళ్లాలి

అనంతరం హోమ్ పేజీలో కన్జూమర్ సర్వీసెస్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి



అందులో కన్జూమర్ సర్వీస్ రిక్వెస్ట్ ఆప్షన్ ఎంచుకోవాలి

ఆ తర్వాత కరెంట్ బిల్లుపై ఉండే యూనిక్ సర్వీస్ నెంబర్, మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి

మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయాలి

అక్కడ అడ్రెస్ చేంజ్, టైటిల్ ట్రాన్స్‌ఫర్, కేటగిరీ మార్పు, లైన్లు, అదనపు లోడ్ మార్పు వంటి ఆప్షన్లు కనిపిస్తాయి

టైటిల్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ ఎంచుకోవాలి

అప్లికేషన్ ఫారంలో అవసరమైన వివరాలు నింపి డాక్యుమెంట్స్ అప్ లోడ్ చేయాలి

అనంతరం రూ.25 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

ఆ తర్వాత సబ్మిట్ చేస్తే సరిపోతుంది

వీటిని అప్ లోడ్ చేయడం తప్పనిసరి

ఆధార్, పాన్ లాంటి ఏదైనా గుర్తింపు ధృవీకరణ పత్రం జేపీజీ, పీఈజీ ఫార్మట్‌లో 100కేబీ సైజులోపు అప్‌లోడ్ చేయాలి. ఇక సేల్ డీడ్ 5ఎంబీ లోపు పీడీఎఫ్ ఫార్మట్‌లో అప్‌లోడ్ చేయాలి. వాటిపై మీ సంతకం చేసి అనంతరం స్కాన్ పేపర్లను అప్‌లోడ్ చేయాలి. రూ.100 నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్ బాండ్ ఫార్మట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. దానిని డౌన్ లోడ్ చేసుకుని అదే ఫార్మట్‌లో అప్‌లోడ్ చేయాలి.

పీఎఫ్ అకౌంట్లో ఈ రెండు తప్పులు చేస్తున్నారా..?

వడ్డీని శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం







పీఎఫ్ ఖాతాదారులకు ప్రతీ ఏడాది వడ్డీని కేంద్రం అందిస్తోంది. అయితే మీరు కొన్ని తప్పులు చేస్తే వడ్డీని కోల్పోయే ప్రమాదముంది. చాలామంది ఉద్యోగాలు మానేశాక లేదా ఉద్యోగాలు మారినప్పుడు పీఎఫ్ అకౌంట్ గురించి పట్టించుకోవడం మానేస్తారు. మూడేళ్ల పాటు అకౌంట్ ఉపయోగించకపోతే ఇనాక్టివ్ అవుతుంది. పీఎఫ్ అకౌంట్ ఉన్నవారికి వారి అకౌంట్లోని బ్యాలెన్స్‌పై ఈపీఎఫ్ఓ ప్రతీ ఏడాది వార్షిక వడ్డీని అందిస్తూ ఉంటుందనే విషయం తెలిసిందే. ప్రతీ ఆర్థిక సంవత్సరం చివరిలో వడ్డీని నిర్ణయిస్తూ ఉంటారు. గత మూడేళ్లుగా వడ్డీని స్థిరంగా 8.25 శాతం వద్ద ఉంచుతోంది. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీని జులై 15వ తేదీలోపు అర్హులైన వారందరికీ ఈపీఎఫ్ఓ అందించింది. ఇప్పటికే ఇవి ఖాతాదారుల అకౌంట్లలో జమ అయ్యాయి. ఈ సారి ముందే అకౌంట్లలో పడటంలో ఖాతాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

1 / 5

అయితే కొన్ని సమయాల్లో మీకు అర్హత ఉన్నా పీఎఫ్ వడ్డీ జమా కాకపోవచ్చు. మూడేళ్ల పాటు మీరు అకౌంట్‌ను ఉపయోగించకపోతే ఆటోమేటిక్‌గా సిస్టమ్ ఇనాక్టివ్ చేస్తుంది. అకౌంట్ నుంచి ఎలాంటి క్లెయిమ్స్ చేయకపోయినా, కేవైసీ లాంటివి అప్డేట్ చేయకపోయినా, ఏం చేయకుండా అలాగే ఏళ్ల పాటు వదిలేస్తే అకౌంట్ ఇనాక్టివ్‌గా మారుతుంది. ఇలాంటి సమయంలో మీరు పీఎఫ్ వడ్డీని అందుకోలేరు. దీంతో అకౌంట్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంచుకోవడం అనేది చాలా ముఖ్యం.

2 / 5

ఇక మీరు 55 సంవత్సరాలు నిండకముందే పదవీ విరమణ చేస్తే 58 ఏళ్ల వచ్చే వరకు వడ్డీ జమ అవుతుంది. ఆ తర్వాత నుంచి జమ అవ్వదు. ఇక శాశ్వతంగా దేశం విడిచి వెళ్లడం, సభ్యుడి మరణించిన సమయంలో ఎవరూ డబ్బులు క్లెయిమ్ చేయకపోవడం వంటి కారణాలతో మూడేళ్ల తర్వాత అకౌంట్ ఇనాక్టివ్ అవుతుంది. ఇలాంటి సమయంలో కూడా వడ్డీ జమ అవ్వదు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 58 ఏళ్ల వచ్చే వరకు యాక్టివ్ ఖాతాలకు వడ్డీ జమ చేస్తారు.

3 / 5

ఈపీఎఫ్ఓ వడ్డీ లెక్కింపు విషయానికొస్తే.. నెలవారీగా మీ అకౌంట్లో నిల్వ ఉన్న బ్యాలెన్స్ ఆధారంగా లెక్కిస్తారు. ప్రతీ నెలా అందుబాటులో ఉన్న బ్యాలెన్స్‌పై వడ్డీ లెక్కిస్తారు. ఆర్థిక సంవత్సరం చివరిలో వీటిని ఒకేసారి జమ చేస్తారు. మీ పీఎఫ్ అకౌంట్లో డబ్బులు జమ అయిన రగ్గర నుంచే మీరు వడ్డీని సంపాదించడం ప్రారంభిస్తారు. ఒకవేళ మీరు మనీ విత్ డ్రా చేసుకుంటే.. మిగిలిన బ్యాలెన్స్‌పై మాత్రమే వడ్డీ చెల్లిస్తారు. విత్ డ్రా చేసుకున్న సొమ్ముపై వడ్డీ అందదు.

4 / 5

ఒకవేళ వార్షిక క్రెడిట్ ఎంట్రీ పాస్‌బుక్‌లో ఆలస్యంగా కనిపించినంత మాత్రాన సభ్యులు వడ్డీని కోల్పోరు.

జనవరి 12 విడుదలనుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్

‘దివికి దివికి’ ప్రోమో విడుదల



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ‘జనవరి 12 విడుదల’. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట ‘దివ్వికి దివ్వికి’ సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా, ఈ పాటతో మ్యూజికల్ మ్యాజిక్ ఖాయమని టీమ్ పోస్ట్‌లలో ఆసక్తిని రేకెత్తించింది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో ‘జనవరి 12 విడుదల’పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, జీ స్టూడియోస్ సౌత్, జీ మ్యూజిక్ సౌత్ వంటి ప్రముఖ సంస్థలు ఈ ప్రాజెక్ట్‌తో అనుసంధానమై ఉన్నాయి.

సంస్కారం వయసుతో పాటు పెరగాలిసీనియర్ జర్నలిస్ట్ వ్యాఖ్యలపై విశ్వక్ సేన్ ఫైర్



తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘ఈఎన్ఈ రిపీట సినిమా గురువారం విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్రంపై సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎన్ మూర్తి చేసిన పరోక్ష వ్యాఖ్యలు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. ‘ఆకాశంలో ఒక తార’ సినిమాను ప్రశంసిస్తూ.. “కుర్రాళ్ల సినిమా అంటే ఇది.. పిచ్చి గెంతులు, బూతు జోకులు కాదు” అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ‘ఈఎన్ఈ రిపీట్’ను ఉద్దేశించేనంటూ చర్చ మొదలైంది. అయితే ఈ విమర్శలపై హీరో విశ్వక్ సేన్ ఘాటుగా స్పందించారు. మరొక సినిమాను పొగుడుతూ, తమ చిత్రాన్ని పరోక్షంగా తక్కువ చేసి చూపేలా మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. ‘కుర్రాళ్ల గురించి, వాళ్ల టేస్ట్ గురించి, టెస్టోస్టిరాన్ గురించి అంచనాలు వేసేంత అప్‌డేటెడ్‌గా మీరు ఉన్నారా? అన్నది నా రివ్యూ. ఒక సినిమాను మెచ్చుకోండి.. అంతేగానీ మరో సినిమాను తక్కువ చేసి మాట్లాడకండి. సంస్కారం, మంచితనం అనేవి వయసుతో పాటు పెరగాలి కానీ, తరగకూడదు’ అంటూ విశ్వక్ సేన్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం విశ్వక్ సేన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

వివాహబంధంలోకి అడుగుపెట్టనున్న టాలీవుడ్ నటుడు శివ కందుకూరి



ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి తనయుడు, టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ శిశిర సింహతో ఆయన వివాహం ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనుంది. తన కాబోయే జీవిత భాగస్వామి శిశిర సింహతో కలిసి దిగిన ఫొటోలను శివ కందుకూరి సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. జీవితంలో మొదలైన ఈ కొత్త, అందమైన ప్రయాణం జీవితాంతం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో, సన్నిహితుల మధ్య వీరి నిశ్చితార్థ వేడుక జరిగినట్లు సమాచారం. డిసెంబర్‌లో పెళ్లి జరగనుండటంతో కందుకూరి కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. ఈ జంట తమ కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్న సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 2020లో వచ్చిన చూసి చూడంగానే సినిమాతో శివ కందుకూరి హీరోగా తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత గమనం, మను చరిత్ర, భూతద్దం భాస్కర్ నారాయణ, మనమే, అనగనగా వంటి చిత్రాలతో పాటు దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్‌లోనూ నటించి మంచి గుర్తింపు పొందారు. ఇటీవలే ఆయన నటించిన టాల్కమ్ పౌడర్ అనే చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

తల్లిదండ్రులైన సమంత రాజ్ నిడిమోరు

కొడుకుకు ‘దేవ్ నిడిమోరు అని నామకరణ



టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా, తమ చిన్నారికి ‘దేవ్ నిడిమోరు’ అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫోటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్ నిడిమోరులకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

ధనుష్ ‘ఓం’ రివ్యూ ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో వచ్చిన సినిమా ఎలా ఉందంటే



‘అమరన్’ విజయం తర్వాత దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కించిన తాజా చిత్రం ‘ఓం’ (ప్రా.వీ). ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, శివాజీరాజా వంటి భారీ తారాగణంతో ధనుష్ స్వయంగా నిర్మించిన ఈ సినిమా, సాయి అభ్యంకర్ సంగీతంతో నేడు థియేటర్లలో విడుదలైంది. 2015లో తిరుపతి అటవీ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించిందో చూద్దాం. కథ 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం, ఆంధ్ర -- తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో విస్తరించిన ఎర్రచందనం స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను అరికట్టడం ఈ సినిమా ప్రధాన కథాంశం. అయితే ఈ కీలక బాధ్యతను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి నిత్యారెడ్డి (సాయి పల్లవి) స్వీకరిస్తుంది. స్మగ్లింగ్ సిండికేట్‌కు మూలమైన అబ్దుల్ హమీద్ (నసీరుద్దీన్ షా)ను చేరుకోవడానికి, అతని సన్నిహితుడైన బర్మా కార్తికేయన్ అలియాస్ సియా (మమ్ముట్టి) గ్యాంగ్‌లోకి ఓ రహస్య ఏజెంట్‌ను చొప్పించాలని నిర్ణయిస్తుంది. ఈ ఆపరేషన్ కోసం పళని (ధనుష్)ను ఎంపిక చేస్తారు. ఫొటోగ్రాఫర్ తిరుకుమారన్‌గా మారి సియా గ్యాంగ్‌లోకి అడుగుపెట్టిన పళని, మెల్లమెల్లగా సియా విశ్వాసాన్ని సంపాదిస్తాడు. అయితే, ఈ సీక్రెట్ మిషన్ ముందుకు సాగుతున్న కొద్దీ పళని వ్యక్తిగత జీవితంలో అనేక చిక్కులు ఎదురవుతాయి. భార్య (శ్రీలీల) విడాకులకు సిద్ధపడటానికి గల కారణమేమిటి? సియా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఎలాంటిది? తిరు అండర్‌కవర్ పోలీసు అని తెలిసిన తర్వాత సియా ఎలా స్పందించాడు? స్మగ్లింగ్ గ్యాంగ్ వల్ల నిత్యారెడ్డి కుటుంబానికి జరిగిన అన్యాయం ఏమిటి? మిషన్ విజయవంతం కోసం నిత్యారెడ్డి చేసిన త్యాగం, తిరు ఎదుర్కొన్న నష్టాల నేపథ్యంలో చివరికి ఆపరేషన్ ఎలా ముగిసింది అనేది మిగతా కథ. విశ్లేషణ వాస్తవ ఘటనకు భావోద్వేగాలను జోడించి, స్మగ్లింగ్ మాఫియా, పోలీస్ ఆపరేషన్, వ్యక్తిగత సంఘర్షణలను సమన్వయం చేస్తూ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని మలిచారు. అయితే, కథనంలో ఊహించని మలుపులు తక్కువగా ఉండటం, స్క్రీన్‌ప్లే రొటీన్‌గా సాగడం వల్ల సినిమా కొంతవరకు సాగదీతగా అనిపిస్తుంది. ఫస్టాఫ్ నెమ్మదిగా మొదలవుతుంది. పాత్రల పరిచయాలు, ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవస్థ పనితీరును వివరంగా చూపించడానికి ఎక్కువ సమయం కేటాయించడంతో కథనం నత్తనడకన సాగిన భావన కలుగుతుంది. ముఖ్యంగా ధనుష్, మమ్ముట్టి మధ్య సంబంధాన్ని బలంగా నెలకొల్పడానికి తీసుకున్న సమయం కొంచెం ఎక్కువైందనిపిస్తుంది. అయితే, ఇంటర్వెల్ సీన్ మాత్రం సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచుతుంది. సెకండాఫ్‌లోనైనా ఆసక్తికరమైన ట్విస్టులు ఉంటాయని భావిస్తే, అక్కడ కూడా పెద్దగా ఆశ్చర్యపరిచే అంశాలు కనిపించవు. కథ, కథనాలు ముందుగానే ఊహించే విధంగా సాగుతాయి. పాత్రల మధ్య బంధాలు, ఎమోషనల్ సన్నివేశాలు సహజంగా కాకుండా కొంత కృత్రిమంగా, బలవంతంగా ఇరికించినట్లు అనిపిస్తాయి. పోలీసులకు, స్మగ్లర్లకు మధ్య సాగే ఘర్షణ కూడా ఆశించిన స్థాయిలో ఉత్కంఠను రేకెత్తించదు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందినప్పటికీ, కథనంలో ఏకపక్ష ధోరణి ఎక్కువగా కనిపిస్తుందనే అభిప్రాయం కలుగుతుంది. నటీనటుల ప్రతిభ ఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే ధనుష్, అండర్‌కవర్ అధికారి తిరు పాత్రకు పూర్తి న్యాయం చేశారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ ఘట్టాల్లోనూ తన అనుభవాన్ని చూపించారు. సాయి పల్లవి నిత్యారెడ్డి పాత్రలో పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా ఆకట్టుకున్నారు. యాక్షన్ సీన్లలోనూ ధీటుగా నటించి మెప్పించారు. మమ్ముట్టి బర్మా కార్తికేయన్ అలియాస్ సియా పాత్రలో హుందాగా, గంభీరంగా కనిపించారు. అయితే, ఆయనలోని అద్భుతమైన నటుడిని మరింత సమర్థవంతంగా, బలమైన సన్నివేశాలతో వాడుకుంటే బాగుండేదనిపించింది. శ్రీలీల పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ, తన పరిధి మేరకు చక్కగా నటించారు. నసీరుద్దీన్ షా, శివాజీరాజా సహా ఇతర నటీనటులు తమ పాత్రలకు తగినట్లుగా రాణించారు. సాంకేతికంగాొ సాంకేతికంగా సినిమాకు మంచి హంగులే ఉన్నాయి. సాయి అభ్యంకర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పలు సన్నివేశాలకు బలాన్ని చేకూర్చి, సినిమా స్థాయిని పెంచింది. పాటలు పర్వాలేదనిపిస్తాయి. సినిమాటోగ్రఫీ బాగుంది; అటవీ ప్రాంతాలు, యాక్షన్ సన్నివేశాలను చక్కగా చిత్రీకరించారు. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. అయితే, ఎడిటింగ్ విభాగం మరింత పదునుగా ఉండాల్సింది. సినిమాలో సాగదీతగా అనిపించే సన్నివేశాలను కత్తిరించి నిడివి తగ్గిస్తే కథనం మరింత వేగంగా, ఆసక్తికరంగా సాగేది. చివరిగా: ధనుష్, సాయి పల్లవి, మమ్ముట్టి వంటి దిగ్గజ తారాగణం నటన, సాయి అభ్యంకర్ నేపథ్య సంగీతం, ఉన్నత నిర్మాణ విలువలు ‘ఓం’ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయి. కథనంలో వేగం కొంత తగ్గినా, ఊహకందే మలుపులు ఉన్నప్పటికీ.. నటీనటుల ప్రతిభ, సాంకేతిక హంగుల కోసం ఈ సినిమాను ఒకసారి చూడదగిన ప్రయత్నంగా చెప్పుకోవచ్చు.

‘ఆకాశంలో ఒక తార’ మూవీ రివ్యూ. దుల్కర్ సల్మాన్ కొత్త మూవీ ఎలా ఉందంటే



సినిమా పేరు: ఆకాశంలో ఒక తాం తారాగణం: దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతిహాసన్, రుహానీ శర్మ, స్వాసిక, ప్రవీణ్.. దర్శకత్వం: పవన్ సాదినే నిర్మాతలు: అల్లు అరవింద్, స్వప్నదత్, సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ విజయాలతో తెలుగు ప్రేక్షకులకు అభిమాన హీరోగా మారారు మలయాళ అగ్ర నటుడు దుల్కర్ సల్మాన్. ఆయన సినిమా వస్తుందంటే టాలీవుడ్‌లో అంచనాలు ఆటోమేటిగ్గా పెరిగిపోతున్నాయి. పైగా ప్రతిభావంతుడైన పవన్ సాదినేని దర్శకుడు కావడం, అభిరుచి గల నిర్మాతలు అల్లు అరవింద్, స్వప్నదత్, సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు కావడతో ‘ఆకాశంలో ఒక తార’ సినిమాపై ప్రారంభం నుంచి ఆడియన్స్‌కి ఓ పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సినిమా విడుదలైంది. మరి ఈ సినిమా అందరి అంచనాలనూ అందుకున్నదా? అనే విషయం తెలియాలంటే ముందు కథలోకి వెళ్లాలి. కథ పల్లెటూరి అమ్మాయి కల్పన(సాత్విక వీరవల్లి)కు వ్యోమగామి కావడం లక్ష్యం. కల్పనా చావ్లాలా ఎప్పటికైనా అంతరిక్షంలోకి వెళ్లాలని కలలుకంటూ ఉంటుంది. కానీ ఆమె కుటుంబం పరిస్థితి వేరే. తండ్రి తాగుబోతు. తల్లినీ, తనను హింసించడం అతని దినచర్య. ఈ హింసలు భరిస్తూనే ఎలాగొలా పదవ తరగతి పూర్తి చేస్తుంది. పక్క ఊరి కుర్రాడు కృష్ణ(దుల్కర్)తో తనకు పెళ్లి ఖాయం చేస్తారు. అక్క సరస్వతి(స్వాసిక) మాట కాదనలేక కృష్ణ కూడా పెళ్లికి ఒప్పుకుంటాడు. కల్పన, కృష్ణల వివాహం జరుగుతుంది. పెళ్లయిన రాత్రే కల్పన కోరిక తెలుసుకుంటాడు కృష్ణ. ఆమె కలను నిజం చేయాలని నిశ్చయించుకుంటాడు. అందుకోసం కృష్ణ ఏం చేశాడు. కల్పనకు వదిలి తను గుజరాత్ ఎందుకు వెళ్లాడు? కల్పన, కృష్ణ జీవితాల్లోకి వచ్చిన రోహిణి(శ్రుతిహాసన్) ఎవరు? ఇంతకీ కల్పన కల నెరవేరిందా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ విశ్లేష భావోద్వేగాలున్న కథకు సరైన కథనం, బలమైన నటీనటులు తోడైతే సినిమా విజయం తథ్యం. ‘ఆకాశంలో ఒక తార’ సినిమా విషయంలో అదే జరిగింది. ఆడపిల్ల తలచుకుంటే ఏమైనా సాధించగలదని రుజువు చేసే స్ఫూర్తిదాయకమైన కథ ఇది. ‘బేటీ బచావో బేటీ పడావో’ నినాదం స్ఫూర్తితో బాలికల విద్య ప్రాధాన్యాన్ని తెలియజెప్పడంతోపాటు, లక్ష్యం, బాధ్యత, ప్రేమాభిమానాలకు సరైన నిర్వచనం చెబుతూ దర్శకుడు పవన్ సాదినేని ఈ సినిమాను తెరకెక్కించారు. బస్ సౌకర్యం కూడా లేని ఓ పెల్లెటూరికి చెందిన అమ్మాయి, ఆకాశానికి నిచ్చెనెలా వేసిందో ఈ కథ చెబుతుంది. ఇది కుటుంబ నేపథ్యంతో కూడిన ఓ వ్యోమగామి కథ. భార్య లక్ష్య సాధనకు తోడై నిలిచిన భర్త కృష్ణగా దుల్కర్ సల్మాన్ నటన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అనుకోకుండా ప్రవేశించిన కొన్ని పాత్రలు కథను ఊహించని మలుపులు తిప్పడం, తద్వారా చోటు చేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేకెత్తిస్తాయి. మొత్తంగా ప్రథమార్ధం ఆద్యంతం అద్భుతంగా సాగింది. కల్పన లక్ష్య సాధన కోసం చేసే ప్రయత్నాలతో ద్వితీయార్ధం కూడా అంతే ఆసక్తిగా సాగింది. భావోద్వేగాలకు తగ్గట్టు సంభాషణలు కూడా సాగాయి. నటీనటులు దుల్కర్ సల్మాన్ ఎప్పటిలాగే తన పాత్రకు వందశాతం న్యాయం చేశారు. కృష్ణగా ఆయన ఎక్కడా నటించలేదు. కేవలం బిహేవ్ చేశారు. తన నటనతో ప్రతి సన్నివేశానికీ సహజత్వాన్ని తెచ్చారు. ఇక కల్పనగా కొత్తమ్మాయి సాత్విక చక్కగా నటించింది.ఆమెలోని అమాయకత్వం, అందం ఆ పాత్రకు మరింత అందాన్ని తెచ్చాయి. ఇంకా రోహిణిగా శ్రుతిహాసన్, బిజిలీగా రుహానీ శర్మ, సరస్వతిగా స్వాసిక అద్భుతంగా నటించారు. మొత్తంగా తారాగణమంతా పరిధిమేర తమ పాత్రలను రక్తికట్టించారు. సాంకేతికంగ పవన్ సాదినేని, గుణ్ణం గంగరాజు కలిసి రాసిన కథనం ఈ సినిమాకు ప్రధాన బలం. అలాగే.. జీవి ప్రకాశ్‌కుమార్ అద్భుమైన సంగీతాన్నందించారు. పాటలన్నీ కథలో భాగంగానే ఉండటం విశేషం. సుజీత్ సారంగ్ కెమెరా పనితనం కూడా బావుంది. ఇది ఓ భావోద్వేగ ప్రయాణం. ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన సినిమా ఇది. బలాలు కథ, మాటలు, సంగీతం, నటీనటుల నటన.. బలహీనతలు అక్కడక్కడ కాస్త నెమ్మదిగా సాగే సన్నివేశాలు

ఓటీటీలోకి వచ్చేసిన సైకలాజికల్ థ్రిల్లర్ మయూఖ స్ట్రీమింగ్ ఎక్కడంటే



తక్కువ బడ్జెట్‌తో కూడా సంచలనం సృష్టించగలమని నిరూపించిన సైకలాజికల్ థ్రిల్లర్ ‘మయూఖ’ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు శ్రీ తేజ్ నాఖ దర్శకత్వం వహించారు. శశిధర్ నల్ల, ప్రశ్వీత ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి ఆదరణ పొందడమే కాకుండా, న్యూయార్క్ మరియు కేన్స్ వేదికలపై అంతర్జాతీయ అవార్డులతో ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతుండగా.. నవంబర్ 23 నుంచి తెలుగు, కన్నడ, తమిళం, హిందీ భాషల్లో అమెజాన్ ప్రైమ్ వీడియోతో పాటు మరో ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో కూడా స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. పెళ్లి కాని యువతి మయూఖ ఒక బ్యాంకులో పనిచేస్తూ ఇన్సూరెన్స్ పాలసీలు చేస్తుంటుంది. నగరంలో ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకుని వరుస హత్యలు జరుగుతుంటాయి. చిన్నతనంలో జరిగిన భయంకరమైన సంఘటనల వల్ల భయంతో బతికే మయూఖకు, తన గదిలో వింత సంఘటనలు ఎదురవుతాయి. ఆమె కూడా ఆ హత్యల జాబితాలో టార్గెట్ అవుతుందా, ఆ అదృశ్య శత్రువు నుండి ఆమె ఎలా బయటపడింది అనేదే ఈ మిస్టరీ థ్రిల్లర్ కథ. ఇక ఈ సినిమా ఎలా ఉండబోతుందనే దానిపై దర్శకుడు శ్రీ తేజ్ నాఖ పంచుకున్న విషయాలు ఆసక్తిని పెంచుతున్నాయి. మొదటి భాగం మలయాళ సినిమా తరహాలో నెమ్మదిగా, స్లో-బర్న్‌గా సాగుతుందట. కానీ ప్రీ ఇంటర్వెల్ దగ్గర కథ కీలక మలుపు తిరుగుతుందని, అక్కడి నుంచి రెండో భాగం అనూహ్యమైన ట్విస్ట్‌లు, ఉత్కంఠతో పరుగులు తీస్తుందని దర్శకుడు తెలిపారు. అలాగే స్పానిష్, కొరియన్, హాలీవుడ్ చిత్రాల స్ఫూర్తితో రూపొందించిన మోనోక్రోమాటిక్ లైటింగ్ ఈ సినిమాకు ప్రత్యేకమైన విజువల్ ఫీల్‌ను ఇస్తుందట. ఓటీటీలో ‘మయూఖ’ చూసేవారికి దర్శకుడు ఓ స్పెషల్ అడ్వైజ్ కూడా ఇచ్చారు. సినిమాలోని సస్పెన్స్, సైకలాజికల్ ఎలిమెంట్స్ పూర్తిగా పండాలంటే మధ్యలో పాజ్ చేయకుండా, ఒకే సిట్టింగ్‌లో చూస్తేనే అసలైన మజా దొరుకుతుందని ఆయన సూచించారు. కొత్త తరహా థ్రిల్లర్ అనుభూతి కోరుకునే వారికి ఇది మంచి ఆప్షన్ అవుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARAS WAMY TEMPLE kPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500072. Edtor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-221, ROAD NO.14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500076. PRGI REGD NO.: TGTEL26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.comCorporate Office: HIG 79, VNR RESIDANCY, VENKATARAMANA COLONY, KUKATPALLY, HYDERABAD, 500085